ప్రజాశక్తి

మంగళవారం 13 ఆగస్టు 2024 8 పేజీలు

ప్రకాశం

బాపట్ల

ఇంటింటా జర్వపీడితులే..

- వైద్యం కోసం ఆర్థిక ఇబ్బందులు
- పేదలకు తప్పని ఇక్కట్లు

జర్వంతో బాధపడుతున్న వృద్ధురాలు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం ప్రాంతంలో ఎక్కడ చూసినా విష జ్వరాల పీడుతులే దర్శనమిస్తున్నారు. గ్రామాల్లో పారిశుధ్యం అధ్వానంగా దర్శనమిస్తోంది. దీంతో డయేరి యా, విష జ్వరాలు వ్యాప్తి చెందుతున్నాయి. ప్రతి ఇంట్లో ఒకరిద్దరూ విష జ్వరాలతో బాధ పడుతున్నారు. వైద్యం కోసం ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులకు క్యూ కడుతున్నారు. కొంతమంది ప్రైవేటు వైద్యుల వద్ద చికిత్స పొందుతూ రూ. వేలల్లో ఖర్చు చేస్తూ ఆర్థికంగా చితికి పోతున్నారు. త్రిపురాంతకం మండలంలోని రామసముద్రం, యర్రగొండ పాలెం మండలంలోని చెన్నరాయునిపల్లి గ్రామంలో విష జ్వరాలు అధికంగా ఉన్నాయి. ఆ గ్రామాలకు చెందిన కె కోటమ్మ, జాను అనే వారు యర్రగొండపాలెంలోని ఏరియా ప్రభుత్వ వైద్యశాలలో చికిత్సలు పొందు తున్నారు.

వైద్యశాలలో చికిత్స పొందుతున్న జర్వ పీడితులు

యర్రగొండపాలెం ప్రాంతంలోని యర్రగొండపాలెం, పుల్లలచెరువు, త్రిపురాంతకం మండలాల్లోని పలువ పలు గ్రామాల్లో విషజ్వరాలు ప్రబలుతున్నాయి.

రోజుకు 700 మంది రోగులు..

యర్రగొండపాలెం పట్టణంలోని ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు ప్రతిరోజూ 700 మంది రోగులు చికిత్స పొందుతున్నారు. అందులో 150 మంది విషజ్వరాలతో బాధ పడుతున్నారు. 50 మంది వాంతులు, విరేచనాలతో బాధ పడుతూ చికిత్స పొందుతున్నారు. కొందరు ప్రభుత్వా సుపత్రిల్లో వైద్య సేవలు పొందుతుండగా మరికొందరు ప్రైవేటు వైద్యశాలల్లో చికిత్స పొందుతున్నారు.

తెలుగుదేశం అధికారంలోకి వచ్చి రెండు నెలలు దాటింది. పాలన ఇంకా వేగం పుంజుకోలేదన్న చర్చ సాగుతోంది. ఇంకా కొంతకాలం చూద్దామనే ధోరణి కొందరిలో వినిపిస్తోంది. ప్రభుత్వం ఎలా ఉందనే చర్చల్లో ప్రస్తుతం మిశ్రమ స్పందనే వినిపిస్తోంది. కారణాలు ఏమైనా నిర్ణయాలు వేగంగా లేవన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

ఆదాయ వనరులపైనే దృష్టి

- చిరుద్యోగులను పీకడమే ఎజెండా
- పెళ్లిళ్లు, పేరంటాలకు హాజరు కావడం తప్ప అభివృద్ధిపై దృష్టిపెట్టని నేతలు
- జిల్లా అధికారుల బదిలీలపై కొనసాగుతున్న నాన్చుడి ధోరణి

ప్రజాశక్తి-ఒంగోలుబ్యూరో

ప్రజాప్రతినిధులు కూడా ఇంకా పూర్తిస్థాయిలో అభివృద్ధిపై దృష్టిసారించలేకపోతున్నారు. ఎందుకంటే ఏం చేయాలన్నా నిధులు కావాలి. రాష్ట్ర ప్రభుత్వ ఖజానా ఖాళీగా ఉంది. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయడానికే అవస్థలు పడుతున్నారు. ఇంకా సూపర్‌సిక్స్ పథకాలు అమలులోకి రాలేదు. పింఛన్ల పెంపు ఒక్కటే అమలు జరిగింది. మిగతా వాటికోసం అందరూ ఎదురు చూస్తున్నారు. ఇక ఈరెండు నెలల్లో పాలక పక్షనేతలు ఏంచేస్తున్నారంటే గ్రామాల్లో ఏది దొరికితే దాన్నిలాక్కునే పనిలో పడ్డారు. నామినేటెడ్ పద్ధతిపై కొద్దిపాటి గౌరవవేతనాలు, రోజువారీ కూలి మేరకు వచ్చే ఆదాయాలు కూడా లేని చిరుఉద్యోగులను పీకేసేపనిలో పడ్డారు. డీలర్లు మొదలు గ్రామాల్లో యానిమేటర్లు, మధ్యాహ్నం భోజన పథకం కార్మికులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, మున్సిపల్ కార్మికులు, స్వచ్ఛ భారత్ కార్మికులను తొలగిస్తున్నారు. ఇంకా చెప్పాలంటే గత ప్రభుత్వ హయాంలో నియమించబడ్డ వారందరినీ పీకేస్తున్నారు. బలవంతంగా ఇంటికి పంపి తెలుగుదేశం కార్యకర్తలను పెట్టుకుంటున్నారు. గ్రామాల్లో ఇపుడు ఇదే పెద్ద ఎజండాగా నడుస్తోంది. పేదల కడుపు కొడుతున్నారు. మధ్యాహ్నం భోజన పథకంలో పనిచేసే నిరుపేద మహిళలను కూడా తప్పిస్తున్నారు. వారికి వైసిపి అనే ముద్ర వేస్తున్నారు. రాజకీయాలతో సంబంధంలేనోళ్లను కూడా బలిచేస్తున్నారు.ఆదాయాలపైనే గ్రామస్థాయి పాలక పక్షనేతలు అందరూ దృష్టి సారించారు. ఎమ్మెల్యేలు కూడా చేసేదేమీ లేక గ్రామాల్లో నాయకులు చెప్పినట్లు మార్పులు చేర్పులు చేస్తున్నారు. బాధితులు వెళ్లి ఎమ్మెల్యేలకు మొరపెట్టు కుంటున్నారు. చూద్దాం చేద్దామంటూ ఏదో ఒకటి చెప్పి వారిని పంపుతున్నారు. ప్రభుత్వం నుంచి చిన్నపాటి ఆదాయం వస్తుందంటే వాటిపై కన్నేస్తున్నారు. బల వంతంగా లాక్కునే పనిలోనే ఉన్నారు. కూటమికి అధికారం అప్పగించింది ఇందుకా?అనే ప్రశ్నలూ తలెత్తుతున్నాయి. ఇవన్నీ ఇపుడు రాజకీయంగా కలకలం రేపుతున్నాయి. వీటితో ▶ 2లో

వైసిపి బాటలోనే తెలుగు తమ్ముళ్లు

కొత్త ప్రభుత్వంలోనూ ఇసుక, మట్టి అక్రమ తరలింపు ఆగలేదు. గతంలో వైసిపి నేతలు ప్రయణించిన బాటలో ప్రస్తుతం టిడిపి నేతలు కూడా పయనిస్తున్నారు. రోజూ వందలాది ట్రక్కుల ఇసుక, మట్టిని అక్రమంగా తరలిస్తున్నారు.

- యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా
- రోజూ వందలాది ట్రక్కులు తరలింపు

బాపట్ల పోలీసు స్టేషన్ వద్ద ఉన్న ఇసుక టిప్పర్లు

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

బాపట్ల జిల్లాలో ప్రస్తుతం ఇసుక అధికారికంగా అందుబాటులో లేదు. రీచ్‌ల ద్వారా ఇసుక సరఫరా అయ్యే పరిస్థితి ఇప్పట్లో లేదు. ఎవరికైనా ఇసుక కావాలంటే గుంటూరు జిల్లా పరిధిలోని ఇసుక రీచ్‌ల వద్ద నుంచి తెచ్చుకోవాల్సి ఉంది. ఫలితంగా ఇసుకకు డిమాండ్ పెరిగింది. దీంతో ఇసుకాసురులు విజృంభిస్తున్నారు. తీర ప్రాంతాలైన బాపట్ల, చీరాల, చినగంజాం, కడవకుదురు, వేటపాలెం, కర్లపాలెం, కొల్లూరు ప్రాంతాల నుంచి ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారు.కాలువ గట్టులు, చెరువుల నుంచి వందల ట్రాక్టర్ల మట్టిని అక్రమంగా తరలిస్తున్నారు.

రాష్ట్రంలో నూతన ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి గ్రామాలు, మండలాల్లో కొత్త నేతలు పుట్టుకొచ్చారు. వారంతా ఇసుకను అక్రమంగా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. గత ప్రభుత్వం హయాంలోని అధికారులు ప్రస్తుతం బదిలీ అవుతున్నారు. దీంతో వారు ఇసుక అక్రమ రవాణా గురించి పట్టించుకునే పరిస్థితి కనిపించడం లేదు. ఇదే అదనుగా భావించి అక్రమార్కులు ఇసుక, మట్టిని పెద్ద ఎత్తున తరలిస్తున్నారు. నిత్యం వందలాది ట్రక్కుల్లో ఇసుక, నల్లమట్టి ఇక్కడి నుంచి ఇతర ప్రాంతాలకు తరలిపోతుంది. అదే విధంగా మండలాలకు రెవెన్యూ, పోలీస్ అధికారులు కొత్త వారు వచ్చారు. వారు కూడా టిడిపి నేతల అక్రమ ఇసుక తరలింపును అడ్డుకునే పరిస్థితి కనిపించడం లేదు. అక్రమార్కులు స్థానిక అవసరాలకు ఇసుక లేదని ప్రజా ప్రతినిధులకు చెప్పి ఇసుక తరలింపు సమయంలో అధికారుల నుంచి ఎలాంటి ఆటంకాలు లేకుండా చూసుకుంటున్నారు. ఐదేళ్లుగా ఆర్థికంగా నష్టపోయామని చెబుతూ ఇసుక అక్రమ రవాణాకు తెరలేపారు. ప్రభుత్వ భూములు, అటవీశాఖ భూముల నుంచి ఇసుక తరలిపోతున్న విషయం తెలిసినా ప్రజాప్రతినిధులు స్థానిక నేతల మాటలను కాదన లేక వారిని నిలువరించే ప్రయత్నం చేయడం లేదు. వైసిపి ప్రభుత్వ హయాంలో ఆ పార్టీ నేతలు, ప్రజాప్రతినిధులు, స్థానిక నేతలు ఇసుకను అక్రమ రవాణా చేశారు. ప్రస్తుతం ప్రభుత్వం మారింది. నేతలు మారారు. ఇసుక అక్రమరవాణా మాత్రం ఆగలేదు.

కృష్ణానది తీరప్రాంతమే దిక్కు....

జిల్లాలో ఇసుక అవసరాలకు కృష్ణానది తీరప్రాంతమే దిక్కుగా మారింది. ప్రతి ఏడాదికి 2 లక్షల మెట్రిక్ టన్నులు పైగా ఇసుక అవసరం అని భావిస్తున్నారు. సగటున నెలకు 17 వేల మెట్రిక్ టన్నుల ఇసుక ▶ 2లో

18న జెవివి జిల్లా వార్షిక మహాసభలు

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురంలో ఈ నెల 18న జన విజ్ఞాన వేదిక జిల్లా వార్షిక మహాసభలు నిర్వహిస్తున్నట్లు జెవివి ఆరోగ్య వేదిక జిల్లా కన్వీనర్ డాక్టర్ బి.శరత్ తెలిపారు. స్థానిక శ్రీవిద్య కోచింగ్ సెంటర్‌లో జన విజ్ఞాన వేదిక పట్టణ కమిటీ సమావేశం ఆ సంఘం పట్టణ గౌరవాధ్యక్షులు చక్కిలం శ్రీధర్ అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శరత్ మాట్లాడుతూ ఈ నెల 18న మార్కాపురంలో జరగనున్న జిల్లా వార్షిక మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. జన విజ్ఞాన వేదిక మండల కార్యదర్శి కె ప్రదీప్ కుమార్ మాట్లాడుతూ మండలంలోని ఉపాధ్యాయులందరూ మహాసభలకు హాజరు కావాలన్నారు. జన విజ్ఞాన వేదిక మండల అధ్యక్షుడు కె సుధాకర్ మాట్లాడుతూ మహాసభ సందర్భంగా మ్యాజిక్ షో, సైన్స్ ప్రదర్శనలు ఉంటాయన్నారు. జన విజ్ఞాన వేదిక జిల్లా నాయకులు ఏనుగుల రవికుమార్ మాట్లాడుతూ మహాసభలకు ప్రభుత్వ మరియు ప్రైవేటు ఉపాధ్యాయులు, అధ్యాపకులు, విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక పట్టణ యూత్ నాయకులు జె శేఖర్, మర్రిపూడి రామకృష్ణ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డాక్టర్ బి శరత్, జెవివి నాయకులు

మాట్లాడుతున్న ఈఒపిఆర్‌డి అన్నమ్మ

గ్రామాభివృద్ధికి పాటుపడాలి

ప్రజాశక్తి-కనిగిరి: కనిగిరి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం గ్రామ పంచాయతీ సర్పంచులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులకు రిఫ్రెషర్ శిక్షణ కార్యక్రమం మొదటిరోజు నిర్వహించారు. సర్పంచులు, కార్యదర్శులు సమన్వయంతో పనిచేసి గ్రామాభివృద్ధికి సహకరించాలని ఎంపిపి దంతులూరి ప్రకాశం కోరారు. శిక్షణ కార్యక్రమానికి కోర్సు డైరెక్టర్, సహాయ కోర్సు డైరెక్టర్లు, ఈఓపిఆర్‌డి ఒంగోలు అన్నమ్మ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

వైసిపి బాటలోనే తెలుగు తమ్ముళ్లు

(మొదటిపేజీ తరువాయి)

కావాల్సి ఉంది. ఇసుక నిల్వలు అయిపోవడం, కొత్తగా ఇసుక రేవులను గుర్తించడంలో జరిగిన జాప్యం వల్ల ప్రస్తుతం జిల్లాలో ఇసుక అందుబాటులో లేకుండా పోయింది. దీంతో గుంటూరు జిల్లాలోని కొల్లిపర, మున్నంగి, తాళ్లాయిపాలెం, లింగాయపాలెం ఇసుక స్టాక్ పాయింట్ వద్ద ఇసుక తెచ్చుకోవాలని అధికారులు తెలిపారు. జిల్లా సరిహద్దుల్లోని కృష్ణానది పరివాహక ప్రాంతంలోని జువ్వలపాలెం, గాజులదిన్నె ఇసుకరీచ్‌ల నుంచి లక్షన్నర మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులోకి వచ్చే అవకాశం ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. బట్టిప్రోలు మండలం ఓలేరు వద్ద 45 వేల మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులో ఉండటున్నారు. జిల్లా పరిధిలో ఇసుక అందుబాటులో రావాలంటే అక్టోబరు వరకూ ఆగాల్సిందే. కృష్ణానదిలో వరద ప్రవాహం ఉన్న నేపథ్యంలో ఇసుక తెచ్చుకోవడం ఇప్పట్లో కుదిరే పని కాదు.ఇసుక విషయమై స్పష్టమైన విధానాన్ని అమలు చేయకపోతే ఇసుకాసురులు మరింత రెచ్చిపోయే పరిస్థితి ఉంది. ఇసుక అక్రమ తలింపు కారణంగా ప్రభుత్వ ఆదాయానికి గండిపడుతోంది.

పురాతన శిలా శాసనం లభ్యం

ప్రజాశక్తి-పొదిలి: పొదిలి వాస్తవ్యుడు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో పురావస్తు శాస్త్రం పరిశోధన విద్యార్థి వడ్డే మాధవ్ క్రీస్తు శకం 15వ శతాబ్దం నాటి రెండో దేవరాయ పరిపాలన నాటి శిలా శాసనాన్ని తన పరిశోధనల ద్వారా వెలుగులోకి తెచ్చాడు. ప్రకాశం జిల్లా, యర్రగొండపాలెం మండలం, నల్లమల అడవిలోని పాలుట్ల గ్రామంలో ఈ విద్యార్థి తన పరిశోధనలో భాగంగా ఈ శాసనాలను గుర్తించాడు. ఆదిమానవుల కాలం నాటి స్టోన్ టూల్స్, మెగాలిథిక్ బ్యరియల్స్ కోసం అడవిలో సంచరించగా మూడు శాసనాలు లభించాయి. ఆ శాసనాలని 'ఎస్టాంపేజ్' (రాతి శాసనం మెడ ఉన్న అక్షరాలను ఒక పెద్ద పేపర్ మీదకు ముద్రలు తీయడం)ను తీసి ఆర్కియాలజీ సర్వే ఆఫ్ ఇండియాలో (ఎఎస్ఐ) శాసనాల అధ్యయన శాఖకు పంపారు. ఈ రాతి శాసనాలను పరిశీలించిన వారికి ఒక శాసనం వారి రికార్డ్స్‌లో ఉందని, మిగతా రెండు వారి దృష్టికి రాలేదు అని తెలియజేశారు. మిగిలిన రెండు శాసనాల్లో వాటి అక్షర శైలిని బట్టి ఒకటి 19వ శతాబ్దం నాటిదిగా మరొకటి 15వ శతాబ్దం నాటిదిగా గుర్తించారు. వీటిని కనిపెట్టి ఆర్కియాలజీ విభాగానికి తెలియజేసినందుకు గాను ఆ శాసనాలను వడ్డే మాధవ పేరున ఆర్కియాలజీ సర్వే ఆఫ్ ఇండియాలో – శాసనాల అధ్యయన శాఖలో రికార్డ్ చేశారు.

ఆదాయ వనరులపైనే దృష్టి

(మొదటిపేజీ తరువాయి)

పాటు సహజవనరులపైనా దృష్టిసారించారు. మొన్నటి వరకూ వైసిపి నేతలను అన్నీ దోచుకుంటున్నారని విమర్శించారు. ఇపుడు వీళ్లు మొదలుపెట్టారు. ఇసుక తరలింపు మొదలైంది.టిప్పర్‌కు రూ.10వేలు వసూళ్లు నడుస్తున్నాయి. పలుచోట్ల అక్రమ తవ్వకాలు మొదలయ్యాయి. గ్రావెల్ పరిస్థితీ ఇదే. కొండలను తవ్వేస్తున్నారు. త్రిపురాంతకం ప్రాంతంలో కొండను తవ్వి గ్రావెల్ తరలింపు సాగుతోంది. వీటికి కూడా వసూళ్లు నిర్ణయించారు. ఇక రేషన్ దందా యథాతథంగా సాగుతోంది. వ్యక్తులు మారారంతే. నియోజకవర్గంలో సేకరణ కొందరికి ఇవ్వగా వాటిని బయట వ్యక్తులకు ఇచ్చినందుకూ పెద్ద మొత్తంలో ఇవ్వాల్సిన ముడుపులు ఎంతనేదీ నిర్ణయించారు. ఎన్నికల్లో కీలకంగా పనిచేసిన వారికే రేషన్ బియ్యం వ్యాపారాలు అప్పగిస్తున్నారు. గ్రానైట్‌లోనూ అక్రమ వసూళ్లు నడుస్తున్నాయి. గత ప్రభుత్వ హయాంలో ఉన్న రేట్లను పెంచారు. బల్లికురవప్రాంతం నుంచి బయటకు వెళ్లేలారీలకు రూ.10వేలు వరకూ వసూళ్లు చేస్తున్నారు. మిగతా నియోజక వర్గాల్లోనూ ఈ తంతుసాగుతోంది. అద్దంకి నియోజకవర్గం నుంచి వెళ్లే లారీలకు వసూళ్లు చేయవద్దంటూ మంత్రి గొట్టిపాటి స్పష్టంగా చెప్పారనే చర్చ సాగుతోంది. దీనిపైనా తర్జనభర్జన నడుస్తోంది. గతంలో మాదిరిగానే అన్ని అక్రమ దందాలు నడుస్తున్నాయి. కేవలం అధికారం మారింది. దోచుకునే వ్యక్తులు మారారు.ఇక పాలనలో ఆశించిన వేగం కనిపించడం లేదు. జిల్లా అధికారులు బదిలీలపైనా రెండు నెలలు దాటినా ఇంకా మీమాంసే నడుస్తోంది. ఫలితంగా పాలనలో వేగం పెరగడం లేదు. ఎమ్మెల్యేలను ఏమి అడిగినా బదిలీలు జరిగాక చూద్దాం చేద్దామంటున్నారు. ఏ నిర్ణయం తీసుకోవడం లేదు. ఎమ్మెల్యేలు కూడా నియోజకవర్గాల్లో ఉదయం నుంచి సాయంత్రం వరకూ పెళ్లిళ్లు, పేరంటాళ్లు, పరామర్శలు, రెస్టారెంట్లు, దుకాణాల ప్రారంభోత్సవాలకు హాజరవుతూ కాలం గడుపుతున్నారు. అభివృద్ధిపై దృష్టి పెట్టలేకపోతున్నారు.వైసిపి నుంచి వచ్చే స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులకు పార్టీ కండువాలు కప్పుతున్నారు. వీటితోనే సరిపోతోంది. ఏదేమైనా పాలనలో ఆశించిన వేగం ఇంకా పెరగలేదనే చర్చ మాత్రం నడుస్తోంది.

లక్ష్యాలు సాధించాలి

ప్రజాశక్తి-దర్శి

ప్రతి ఎల్ఐసి ఏజెంట్ ఎండిఆర్‌టి (మిలియన్ డాలర్ రౌండ్ టేబుల్)లను సాధించాలని దర్శి ఎల్ఐసి బ్రాంచ్ మేనేజర్ కె మహదేవ అన్నారు. సోమవారం స్థానిక ఎల్ఐసి బ్రాంచ్ కార్యాలయంలో రెండు ఎండిఆర్‌టిలను చేసిన తిరుపతమ్మను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బ్రాంచ్ మేనేజర్ మహదేవ మాట్లాడుతూ ఎల్ఐసి ఏజెంట్లు లక్ష్యాలకు అనుగుణంగా నూతన పాలసీలను ఎంచుకొని విరివిగా పార్సిల్ చేసి ఎల్ఐసి బ్రాంచ్‌కు మంచిపేరు తీసుకురావాలని కోరారు. ఈ సందర్భంగా తిరుపతమ్మను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అభివృద్ధి అధికారులు రమేష్‌బాబు, చంద్రశేఖర్, అమ్మనాయక్, ఏజెంట్లు పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

మెసర్స్ శ్రీ సూర్య గ్రానైట్స్ అను వారికి సర్వే నెంబర్: 965/6,7,8,9,10 & 14, 966/6,7,8,9,10, 969/9, 11 & 12, 970/1 & 4 లో 5.649 హెక్టర్స్ మరియు 935/2,3,4,5,6&7 లో 2.650 హెక్టర్స్ చీమకుర్తి గ్రామము, చీమకుర్తి మండలం, ప్రకాశం జిల్లా నందు బ్లాక్ గెలాక్సీ గ్రానైట్ మైన్ కు స్టేట్ లెవెల్ ఎన్విరాన్మెంట్ ఇంపాక్ట్ అసెస్మెంట్ అథారిటీ (SEIAA), ఆంధ్రప్రదేశ్ నుండి పర్యావరణ అనుమతి పొందినారు. దీనికి సంబంధించిన అనుమతి పత్రములు ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి వద్ద మరియు వారి వెబ్ సైట్ www.appcb.ap.nic.in లోను పొందుపర్చడమైనది.

1. SEIAA/AP/PKM/MIN/05/2020/1873/213.03 & 210.01, dated 28.03.2023 - 5.649Ha.
2. SEIAA/AP/PKM/MIN/11/2019/1415-842. dated 14.12.2020 - 2.650Ha.

మహారాజశ్రీ నర్సరావుపేట ప్రిన్సిపల్ సీనియర్ సివిల్‌జడ్జి సీనియర్ డివిజన్ వారి కోర్టులో
హెచ్.ఎం.ఓ.పి. నెం. 11/2023

బిట్వీన్:
పూటికొండ రమేష్ .... పిటీషనర్
వర్సెస్
పూటికొండ వెంకట పద్మావతి అండ్ ఇతరులు
..... రెస్పాండెంట్లు

1వ ప్రతివాది :
పూటికొండ వెంకట పద్మావతి, భర్త : రమేష్, తండ్రి : పొదిలి సుబ్బారావు, ఆర్/ఓ, మేదరమెట్ల, కొరిశపాడు మండలం, ప్రకాశంజిల్లా.

పైన తెలిపిన పిటీషన్ నందలి పిటీషనరు వివాహ రద్దు నిమిత్తం మీ పై సదరు దావాను దాఖలు చేసి యున్నారనియు, ఇందుకు సంబంధించి మీకు ఎన్ని పర్యాయములు గౌరవ కోర్టు ద్వారా నోటీసులు జారీ చేసినను మీరు సదరు కోర్టు నోటీసులు తీసుకొనకుండా దురుద్దేశ్య పూర్వకంగా కాలయాపన చేయుచున్నందు వలన పేపరు ప్రకటన ద్వారా నోటీసులు జారీ చేయవలసినదిగా గౌరవ కోర్టువారు ఆర్డరు చేసి యున్నారు. కావున ది. 20-8-2024వ తేదీన ఉదయం 10-30 గం.లకు పై కోర్టువారి యెదుట హాజరయి మీకు గల అక్షేపణలు స్వయంగా గానీ, లేదా మీ తరపు న్యాయవాది గారి ద్వారా గానీ తెలియజేసు కోగలరు. లేనియెడల దావాను మీ పరోక్షమున తీర్మానించబడునని తెలియపరచడమైనది.

వాయిదాతేదీ : 20-8-2024

ఇట్లు
సి.హెచ్.దయారత్నం,
పిటీషనరు తరఫు న్యాయవాది,
చిలకలూరిపేట.
సెల్ నెం. : 80748 57876

మహారాజశ్రీ మార్కాపురం ఆరవ అదనపు జిల్లాజడ్జి వారి కోర్టులో
ఓ.ఎస్. నెం: 26/2023

చేగిరెడ్డి అనిల్‌కుమార్‌రెడ్డి మరియు ఇతరులు
..... వాదులు
మంచికంటి సులోచన .... ప్రతివాది

టు,
మంచికంటి సులోచ, భర్త: శ్రీనివాసరావు
వయసు: 63 సం॥, నివాసం: డోర్ నెం: 6-41, పాందురంగస్వామి దేవాలయం దగ్గర, బేస్తవారిపేట గ్రామము మరియు మండలం, ప్రకాశం జిల్లా.

పై నెంబరు గల దావా వాదులు పై తెలిపిన ప్రతివాదిపై పైకం వసూలు నిమిత్తం పై తెలిపిన కోర్టు నందు దావా దాఖలు చేసియున్నారు. ఈ దావా నందు వాదులు పై తెలిపిన ప్రతివాదికి అనేక పర్యాయములు దావా సమన్లు పంపినను తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. కావున ఘనమైన కోర్టు వారు ప్రతివాదికి దావా సమను జారీ నిమిత్తం 27-08-2024వ తేదిన వాయిదా వేసి యున్నారు. కావున పై తేదీన ఉదయం 10:30 గంటలకు పై కోర్టు వారి ఎదుట స్వయముగా లేదా వకీలు ద్వారా గాని హాజరై నీ అక్షేపణలు తెలుపుకొనవలసినది. లేని యెడల నీ పరోక్షమందు కేసు విచారించి తీర్మానించబడునని నీకు తెలియ జేయడమైనది.

// కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //

వాయిదా: 27-08-2024

మధిరె శ్రీరామిరెడ్డి
అడ్వకేట్, మార్కాపురం
సెల్: 9440183063.

మహారాజశ్రీ మార్కాపురం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
I.P.NO: 20/2021

యాతం శివకృష్ణా రెడ్డి ..పిటిషనర్
యెదిరి
పేర్ల బ్రహ్మానంద రెడ్డి మరియు వగైరాలు
.. రెస్పాండెంట్స్

టు,
R5 రెస్పాండెంట్ చిరునామా
జొసాని నందివర్ధన్ రెడ్డి తండ్రి పెద్ద కోటిరెడ్డి, దంతెరపల్లి గ్రామం, సంజీవరావుపేట మజరా, గిద్దలూరు మండలం, ప్రకాశం జిల్లా.
R6 రెస్పాండెంట్ చిరునామా
చింతరెడ్డి శ్రీనివాసరెడ్డి తండ్రి రామిరెడ్డి, జమ్ములపల్లి గ్రామం, ఆదిమూర్తిపల్లి మజరా, గిద్దలూరు మండలం, ప్రకాశం జిల్లా.

పై నెంబర్ పిటిషన్‌లో పిటిషన్ పరిహారం కొరకు పిటిషనర్ మీపై పిటిషన్ దాఖలు చేసి యున్నందున, మీకు నోటీసు నిమిత్తము 14-08-2024 తేదికి వాయిదా వేసియున్నారు. కనుక తేదీ 14-08-2024 ఉదయం 10:30 గంటలకు మీరు స్వయముగా కానీ, మీ వకీలు గారి ద్వారా గాని పై కోర్టులో సంజాయిషీ చెప్పుకోవలసియున్నది. లేని యెడల మీ పరోక్షమందు పిటిషన్ ను విమర్శించి తీర్మానించబడును

// కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //

వాయిదా తేదీ: 14-08-2024

ఇట్లు
కాకునూరి హిమశేఖరరెడ్డి,
పిటిషనర్ పరం న్యాయవాది,
గిద్దలూరు, ప్రకాశం జిల్లా.

మహారాజశ్రీ మార్కాపురం ఆరవ అదనపు జిల్లాజడ్జి వారి కోర్టులో
ఎ.ఎస్. నెం: 42/2023

దప్పిలి విజయభాస్కర్‌రెడ్డి మరియు ఇతరులు
...... అప్పిలెంట్స్
వర్సెస్
కాటసాని రాజమ్మ మరియు ఇతరులు
...రెస్పాండెంట్స్

టు,
ఆర్-3,
కాటసాని పెద్ద వెంకటరెడ్డి, తండ్రి: లేట్ వెంకటసుబ్బారెడ్డి, వయసు: 74 సం॥, నివాసం: డోర్ నెం: 4-8-111, 4వ వార్డు, గిద్దలూరు గ్రామం, గిద్దలూరు తాలూకా, ప్రకాశం జిల్లా.
ఆర్-8,
పోగుల సావిత్రి, భర్త: శంకరరెడ్డి, వయసు: 59 సం॥, నివాసం: 4-8-111, 4వ వార్డు,గిద్దలూరు గ్రామం, గిద్దలూరు తాలూకా, ప్రకాశం జిల్లా.

పై నెంబరు అప్పీలు దావాను అప్పిలెంట్స్ రెస్పాండెంట్స్ మీద అప్పీలు దావా వేసియున్నారు. తేదీ: 21-08-2023న ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు: గిద్దలూరులో ఓ.ఎస్. నెం: 393/2007 డిక్రీ మీద అప్పిలెంట్స్ నెంబరు 3 మరియు 8వ రెస్పాండెంట్స్ అయిన మీకు ఎన్ని పర్యాయములు కోర్టు నుండి అప్పీలు నోటీసులు పంపినను మీరు తీసుకొనకుండా కాలయాపన చేయుచున్నారు. కావున కోర్టు వారు మీకు అప్పీలు నోటీసులు పేపరు ప్రకటన ద్వారా జారీ చేయుటకు ఆర్డర్ వేసియున్నారు. కావున తేదీ: 23-08-2024న వాయిదా వేసియున్నారు. కావున ఆ రోజు ఉదయం 10:30 గంటలకు మీరు స్వయముగా గానీ లేదా వకీలు ద్వారా గానీ హాజరై మీ అక్షేపణలు తెలుపు కొనగలరు. లేని యెడల మీ పరోక్షమందు విమర్శచేసి తీర్మానించబడునని ఖండితముగా తెలియజేయడ మైనది.

// కోర్టు వారి ఉత్తర్వులతో //

వాయిదా: 23-08-2024

మధిరె శ్రీరామిరెడ్డి
అడ్వకేట్, మార్కాపురం.
సెల్: 9440183063.

కోర్టు నోటీసు
మహారాజశ్రీ ఒంగోలు ప్రిన్సిపల్ జిల్లా జడ్జి వారి కోర్టులో
IA.No.1082/2023
A.S.No. /2023

కొల్లూరి శ్రీనివాసులు .....పిటీషనర్
వర్సెస్
ఇలవల మురళీధర్ మరియు ఇతరులు
......రెస్పాండెంట్స్

To
1వ రెస్పాండెంట్,
ఇలవల మురళీధర్, తండ్రి గద్వాల్ రెడ్డి, ఎ.పి.హెచ్.బి కాలనీ, ఎమ్.ఐ.జి, డోర్ నెం. 181, ఒంగోలు టౌన్, ప్రకాశం జిల్లా.
2వ రెస్పాండెంట్,
చలువాది వెంకట సుబ్రహ్మణ్యం, తండ్రి వెంకట సుబ్బారావు, డి1, గుప్తాస్ శరణిటి అపార్ట్ మెంట్, సాయిబాబా టెంపుల్ వెనుక, లాయర్ పేట్, 1వ క్రాస్ రోడ్, ఒంగోలు టౌన్, ప్రకాశం జిల్లా.
3వ రెస్పాండెంట్.
గంధి హరిబాబు, తండ్రి సుబ్బారావు, 5.30.30-1-6.అద్దేపల్లి వారి స్ట్రీట్, గాంధీరోడ్ ఒంగోలు టౌన్, ప్రకాశం జిల్లా,

పై నెంబరు దావాలో మీరు 1.2.4వ రెస్పాండెంట్స్ అయియున్నారు. మీకు ఎన్ని పర్యాయములు నోటీసులు పంపించినను మీకు చేరనందున శ్రీ కోర్టువారు మీకు నోటీసు నిమిత్తం ప్రజాశక్తి డైలీ పేపరు ప్రకాశం జిల్లా ఎడిషన్లో పబ్లికేషన్ ద్వారా మీకు తెలియపరచుటకు ఆర్డరు వేసినారు. మీరు ఈ ప్రకటనను చూసిన పిదప తేది: 27-08-2024 ఉదయం 10:30 గం.లకు మీరు గాని, మీ తరపున లాయరు గాని పై కోర్టువారి ఎదుట హాజరై మీకు పై తెలిపిన దావాలో అభ్యంతరాలు ఉన్న యెడల తెలుపుకోవలెను. అట్లు మీరు హాజరు కాని యెడల మీకు ఎటువంటి అక్షేపణలు లేవని భావించి పైన తెలిపిన దావాను కోర్టువారు మీ పరోక్షమున తీర్మానించబడునని తెలియజేయడమైనది.

// కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //

ఒంగోలు,
తేది : 10-08-2024

పంగులూరి గోవిందయ్య,
పిటిషనర్ తరపున న్యాయవాది,
ఒంగోలు, ప్రకాశం జిల్లా

వివరాలు వెల్లడిస్తున్న విద్యుత్ శాఖ అధికారులు

విద్యుత్ అధికారుల తనిఖీలు

ప్రజాశక్తి-మద్దిపాడు

మండలంలోని అన్ని గ్రామాలలో విద్యుత్ శాఖ అధికారులు సోమవారం ఆకస్మికంగా తనిఖీలు చేపట్టారు. అక్రమంగా విద్యుత్ చౌర్యం చేస్తున్నవారు, టారిఫ్‌కు మించి విద్యుత్ వినియోగిస్తున్న వారిని ఈ తనిఖీలలో గుర్తించారు. విజిలెన్ విభాగం వారు 7 కేసులు నమోదు చేసి రూ.75 వేలు జరిమానా విధించారు. ఆపరేషన్స్ విభాగంలో 62 మంది 31 టీములుగా పాల్గొని 2,625 సర్వీసులను తనిఖీ చేశారు. 212 కేసులు నమోదు చేసి రూ.8,81,500 జరిమానాలు విధించారు. వారి వెంట ఏడీఈ మోహన్ రావు, మద్దిపాడు ఏఈ చెన్నారెడ్డి, పలువురు లైన్ ఇనస్పెక్టర్లు, లైన్మెన్లు జేఎల్‌ఎంలు పాల్గొన్నారు.

మున్సిపల్ స్థలాన్ని కాపాడాలి

జిల్లా కలెక్టర్‌కు స్థానికుల ఫిర్యాదు

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురం మున్సిపాలిటీ పరిధిలోని 3వ వార్డులో మున్సిపల్ స్థలాన్ని ఓ వ్యక్తి ఆక్రమించి అక్రమంగా కట్టడం మొదలు పెట్టారని, ఆ స్థలాన్ని కాపాడాలని స్థానికులు జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియాకు సోమవారం ఫిర్యాదు చేశారు. మూడో వార్డులోని శ్రీ కోదండరామ స్వామి దేవస్థానం దక్షిణం వైపున మున్సిపాలిటీకి చెందిన రస్తా స్థలాన్ని గోళ్ల ప్రసాద్ అనే వ్యక్తి ఆక్రమించాడని, ఆ స్థలంలో కట్టడం మొదలు పెట్టారన్నారు. గత ఏడాది ఆగస్టు 7వ తేదీన మార్కాపురం మున్సిపల్ కమిషనర్‌కు అర్జీ ఇచ్చినా ఫలితం లేకపోయిందని స్థానికులు ఆరోపించారు. ఆక్రమణకు గురైన స్థలం విలువ సుమారు రూ. 60 లక్షలు ఉంటుందన్నారు. ఆ స్థలంలో గత 70 సంవత్సరాల నుంచి దేవస్థాన కార్యక్రమాలు, ప్రసాద వినియోగం, భజన, తదితర కార్యక్రమాలు జరుగుతాయని ఆలయ కమిటీ సభ్యులు వివరించారు. దేవుని ఊరేగింపు, పల్లకి రాకపోకలకు ఆక్రమణతో తీవ్ర అంతరాయము కలుగుతుందన్నారు. మున్సిపల్ స్థలంలో అక్రమ నిర్మాణాలు నిలుపుదల చేయాలని, ఆ స్థలం పరిరక్షించాలని కోరారు. కలెక్టర్ తమీమ్ అన్సారియాను కలిసిన వారిలో సురభి లక్ష్మయ్య, సురభి వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు, ఉప్పలపాటి కేశవ, కేశవ, టి.వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

సబ్ కలెక్టర్ రాహుల్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎఐటియుసి నాయకులు, ఆశా కార్యకర్తలు

ఆశా వర్కర్లపై రాజకీయ వేధింపులు ఆపాలి

సబ్ కలెక్టర్ రాహుల్‌కు ఎఐటియుసి వినతి

ప్రజాశక్తి-మార్కాపురం

ఆశా వర్కర్లపై అధికార పార్టీ నేతల రాజకీయ వేధింపులను ఆపాలని కోరుతూ ఎఐటియుసి జిల్లా కార్యదర్శి షేక్ ఖాశిం సబ్ కలెక్టర్ రాహుల్ మీనాకు సోమవారం వినతిపత్రం అందించారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం ఆశా వర్కర్లకు నెలకు రూ.26 వేలు వేతనం ఇవ్వాలని కోరారు. అర్హులైన వారికి ఇంటి స్థలం ఇవ్వాలన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఎం.పద్మావతి, ఎస్.నరసమ్మ, జె.అరుణకుమారి, ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ వేధింపులు ఆపాలి

విఓఎను తొలగించవద్దని గ్రూపు లీడర్లతో కలిసి సిపియం నాయకుల నిరసన

ప్రజాశక్తి - నాగులుప్పలపాడు

వివఒ రాచూరి మాధవిని రాజకీయ కక్షతో తొలగించడం సరైన పద్ధతి కాదని సిపియం మండల కార్యదర్శి టి. శ్రీకాంత్, సిఐటియు మండల కార్యదర్శి జి.బసవపున్నయ్య అన్నారు. మండలంలోని తిమ్మసముద్రంలో వివఒని తొలగించడంపై సోమవారం 36 గ్రూపుల లీడర్లతో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు మాట్లాడుతూ గ్రూపు లీడర్లతో సంబంధం లేకుండా విఒఎను మార్చడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. వెంటనే గ్రామంలో విఒఎ పరిధిలో ఉన్న డ్రాక్రా గ్రూపులు లీడర్లు, సభ్యులతో సమావేశం నిర్వహించి మెజారిటీ సభ్యుల నిర్ణయం ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు. అధికారులు రాజకీయ నాయకుల ఒత్తిడికి లొంగి ఇలాంటి చర్యలకు పాల్పడం సరైన పద్ధతి కాదన్నారు. మాధవి గత 25 సంవత్సరాల నుండి విఓఏగా సేవలందిస్తూ ఆమె పరిధిలో ఉన్న 36 గ్రూపులకు ఎటువంటి ఇబ్బందులు కలగకండా సేవలు చేస్తుందన్నారు. ఎటువంటి అవినీతికి ఆస్కారం లేకుండా ఇప్పటివరకు పనిచేయడంతో తిరిగి ఆమెనే ఎన్నుకోవడం జరుగుతుందని గ్రూపుల లీడర్లు తెలిపారు. తక్షణమే ఏపీఎం ఈ సమస్యను పరిష్కరించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని మహిళలు హెచ్చరించారు. అనంతరం ఏపీఎం హనుమంతరావుకు వినతిపత్రం అందజేశారు.

ఏపీఎం హనుమంతరావుకు వినతిపత్రం అందజేస్తున్న గ్రూపు లీడర్లు

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

ఎంఇఒ ఆంజనేయులు

సార్డ్స్ ఆధ్వర్యంలో డ్రగ్స్ ఫ్రీ క్యాంపెయిన్

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యువత మాదక ద్రవ్యాలకూ దూరంగా ఉండాలని ఎంఈవో పి.ఆంజనేయులు అన్నారు. సోమవారం డ్రగ్స్ ఫ్రీ ఇండియా క్యాంపెయిన్‌లో భాగంగా జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా ఆదేశాల మేరకు సార్డ్స్ సంస్థ ఆధ్వర్యంలో యర్రగొండపాలెం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు రమాదేవి అధ్యక్షతన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ మత్తు పదార్థానికి బానిసలు కాకూడదని తెలిపారు. కుటుంబాలు చిన్నాభిన్నం అవ్వడానికి డ్రగ్సే కారణమన్నారు. డ్రగ్స్‌కు అలవాటు పడితే ఎక్కువగా అనారోగ్య సమస్యలకు గురికావాల్సి వస్తుందని చెప్పారు. డ్రగ్స్‌కు అలవాటు పడి మంచి భవిష్యత్తుని నాశనం చేసుకోవద్దని తెలిపారు. అనంతరం మానవహారం నిర్వహించి, నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో బాల ప్రకాశం సిబ్బంది రామలక్ష్మి, సేసిమోహన్. సుప్రియ, గురవయ్య, ధర్మనాయక్, సుధాకర్, చిన్న బాబు తదితరులు పాల్గొన్నారు.

టంగుటూరు: పేస్ ఇంజనీరింగ్ కలాశాలలో విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటామని, సమాజం యొక్క పురోగతి భాగస్వాములు అవుతామని, కుటుంబానికి, భావితరాలకు ఆదర్శంగా ఉంటామని, డ్రగ్స్ ఫ్రీ సొసైటీ రూపొందించటంలో భాగం అవుతామని ప్రతిజ్ఞ చేశారు. స్థానిక పేస్ ఇంజనీరింగ్ కాలేజీలో నషముక్త భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మాదక ద్రవ్యాల వినియోగంతో యువతపై ప్రభావం గురించి వివరించారు. ఈ కార్యక్రమానికి కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్, ప్రిన్సిపల్ డాక్టర్ జి.వి.కె.మూర్తి, డీన్ స్టూడెంట్ ఎఫైర్స్ అర్.వీరాంజనేయులు, వివిధ డీన్‌లు, విభాగాధిపతులు అధ్యపక సిబ్బంది ఎన్.ఎస్.ఎస్, ఎన్‌సిసి వాలంటీర్లు పాల్గొన్నారు.

మానవహారం నిర్వహిస్తున్న విద్యార్థులు

తమిళనాడు ప్రమాదంలో పొదిలి విద్యార్థికి గాయాలు

ప్రజాశక్తి-పొదిలి

తమిళనాడు రాష్ట్రం విజయపురం చిత్తూరు–నగరి ఆంధ్ర సరిహద్దులోని కనకమ్మ సత్రం పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఏడుగురు విద్యార్థులు ప్రయాణిస్తున్న కారును లారీ ఢీకొనగా ఐదుగురు మృతి చెందారు. ఈ విద్యార్థులు తిరువళ్లూరు ఎస్ఆర్ఎం కాలేజిలో బిటెక్ చదువుతూ కాణిపాకం దర్శనానికి వచ్చి తిరుగు ప్రయాణంలో కాలేజీకి వెళుతున్న క్రమంలో జరిగిన ప్రమాదంలో ఐదుగురు విద్యార్థులు మృతి చెందారు. ఇద్దరు విద్యార్థులకు గాయాలయ్యాయి. ఈ ప్రమాదంలో పొదిలి బ్యాంకు కాలనీ, నవోదయ స్కూలు వద్ద నివాసం ఉంటున్న కొల్లూరి చైతన్య కుమార్ చేతికి, తలకు, నుదుటి మీద, నడుము మీద దెబ్బలు తగిలి తమిళనాడు తిరువల్లూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఇతని తండ్రి కొండలరావు, ప్రకాశం జిల్లా మర్రిచెట్లపాలెంలో లక్ష్మీ తులసీ రామ్ గ్రానైట్ ఎక్స్‌పోర్ట్ ఫ్యాక్టరీ నిర్వహిస్తున్నాడు. పొదిలి బ్యాంకు కాలనీలో నివాసం ఉంటున్నారు. ఇతని సొంత ఊరు ప్రకాశం జిల్లా, పొన్నలూరు మండలం, జడ్.మేకపాడు పంచాయతీ, ఓరుగంటివారిపాలెం గ్రామం. కొల్లూరి చైతన్య కుమార్‌తోపాటు నెల్లూరు జిల్లా గూడూరుకు చెందిన విష్ణువర్ధన్ కూడా తిరువల్లూర్ గవర్నమెంట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ ప్రమాదంలో కారులోని తిరుపతికి చెందిన ఇద్దరు, విజయవాడకు చెందిన ఒక్కరు, అనంతపురానికి చెందిన ఒకరు, ప్రొద్దుటూరుకు చెందిన ఒకరు, మొత్తం ఐదుగురు ఎస్ఆర్ఎం కాలేజీ విద్యార్థులు చనిపోయారు. ఏడుగురు విద్యార్థులు అద్దె కారులో సొంతంగా డ్రైవింగ్‌తో, తిరువన్నామలై, కాణిపాకం దర్శనం చేసుకుని తమిళనాడు ఎస్ఆర్ఎం కాలేజీకి వెళుతుండగా, రాజస్థాన్‌కు చెందిన లారీ కారును ఢీకొన్నది. విషయం తెలుసుకున్న చైతన్యకుమార్ తండ్రి కొండలరావు పొదిలి నుంచి హుటాహుటిన తిరువల్లూర్‌కు ఈ రాత్రి బయలుదేరి వెళ్లారు.

గాయపడిన చైతన్య కుమార్

జూదరులు అరెస్టు

ప్రజాశక్తి - మద్దిపాడు

మండల పరిధిలోని రాచవారిపాలెం ఎస్సీ కాలనీలో పేకాట ఆడుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.4,500 సీజ్ చేసినట్లు ఎస్సై మహేష్ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు. గ్రామాలలో అసాంఘిక కార్యక్రమాలకు ఎవరైనా పాల్పడితే పోలీసులకు తెలపాలని సూచించారు. ఈ దాడిలో పోలీసు సిబ్బంది ఉన్నారు.

పొదిలి: జూదం ఆడే విషయంలో ఎవరినీ వదిలిపెట్టే ప్రసక్తే లేదని స్థానిక ఎస్ఐ కోటయ్య హెచ్చరించారు. సోమవారం మండలంలోని రాజుపాలెం గ్రామం పొలాల్లో పేకాట స్థావరాలపై దాడులు చేసి పదిమందిని అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద నుంచి రూ.55,800 నగదును స్వాధీనం చేసుకున్నారు. పది మందిని అరెస్టు చేసి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పొదిలి ఎస్ఐ కోటయ్య తెలిపారు. సంఘ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే ఎంతటివారినైనా ఉపేక్షించేది లేదని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పోలీసులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయంలో చోరీ

ప్రజాశక్తి-రాచర్ల

రాచర్ల మండలం, రాచర్ల గ్రామం సమీపంలో గల అక్కదేవతల ఆలయంలో ఆదివారం రాత్రి దొంగలు పడ్డారు. బయట తాళం పగలగొట్టి గర్భగుడిలోకి ప్రవేశించి ఆలయంలోని పూజా సామగ్రి, పలు వస్తువులను చోరీ చేశారు. సోమవారం గుడి పూజారి వచ్చి చూడగా తాళం పగుల కొట్టి ఉండటం చూసి, చోరీ జరిగినట్లు గ్రహించిన పూజారి రాచర్ల పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వచ్చి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కారు బోల్తా.. పలువురికి గాయాలు

ప్రజాశక్తి-పొదిలి

మర్రిపూడి మండలం కూచిపూడి –గార్లపేట రహదారిలో కొత్తూరు గ్రామం వద్ద కారు బోల్తా పడిన సంఘటన సోమవారం జరిగింది. కూచిపూడి నుంచి గార్లపేట వరకూ రహదారి నిర్మాణం కోసం కంకర పోసి వదిలేయడంతో అటుగా వెళ్తున్న కారు స్కిడ్ అయి పొలాల్లోకి పల్టీ కొట్టి బోల్తా పడింది. ఈ మార్గంలో వాహనాలు స్కిడ్ అయి ఇలా తరచూ బోల్తా పడుతున్నాయి. ఆర్అండ్‌బీ అధికారుల నిర్లక్ష్యం వలన ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనదారులు ఆరోపిస్తున్నారు. రోడ్డు పక్కనే పొలాలు ఉండటంతో కంకర స్కిడ్ అయి వచ్చి పొలాలలో పనిచేస్తున్న వారికి రాళ్లు తగులుతున్నాయని రైతు కూలీలు అంటున్నారు.

బోల్తా పడిన కారు

ఎస్‌పికి పుష్పగుచ్ఛమిస్తున్న మాగుంట రాఘవరెడ్డి

ఎస్‌పి దామోదర్‌ని కలిసిన మాగుంట రాఘవ రెడ్డి

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

జిల్లా ఎస్‌పి ఎఆర్ దామోదర్‌ను ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి తనయుడు మాగుంట రాఘవ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో మాగుంట రాఘవ రెడ్డి ఎస్‌పికి పుష్పగుచ్ఛమిచ్చి ఘనంగా సత్కరించారు.

పెంపకందారుల సంక్షేమానికి చర్యలు చేపట్టాలి

◆ జిఎంపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దబ్బాయి ◆ బాపట్ల జిల్లా నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - చీరాల

గొర్రెలు, మేకల పెంపకం దారుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎపి గొర్రెలు, మేకల పెంపకం దారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిలారి పెద్దబ్బాయి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో బుర్రి ఆంజనేయులు అధ్యక్షతన సోమవారం జరిగిన రెండో ప్రతినిధుల మహాసభలో ఆయన మాట్లాడారు. ఈ మహాసభలో పెంపకం దారులు ఎదుర్కొనే సమస్యలపై తీర్మానాలు చేశారు. వర్షాకాలం సీజన్ మొదలై గొర్రెలకు మూతి జబ్బులు, కాలికుంటు వ్యాధులు విస్తృతంగా ప్రభలుతున్నాయని అన్నారు. అక్కడక్కడ జివాలు మృత్యువాత పడుతున్నాయి. వీటి నివారణకు పశువైద్యశాలలో తగిన మందులు అందుబాటులో ఉంచాలని కోరారు. గొర్రెల మేతకు సంబంధించి పంటలు అన్ని వేసిన తర్వాత మేపుకోవడానికి కాళీ భూములు ఉండటం లేదని అన్నారు. ప్రభుత్వ భూములు ఆక్రమణ గురి కావడంతో గొర్రెలకు మేత సమస్య తీవ్రంగా ఏర్పడుతున్నదని అన్నారు. గ్రామ సొసైటీలకు పశువుల మేతకు భూములు కేటాయించాలని కోరారు. వర్షాకాలంలో గొర్రెలు తడిసి అనేక రకాల జబ్బులకు గురవుతున్నాయని అన్నారు. దీనికోసం కొత్త ప్రభుత్వం గోకులం పేరుతో షెడ్ల పథకాన్ని తీసుకొచ్చిందని అన్నారు. అయితే గొర్రెల కాపరులకు తక్కువ రాయితీ 70 శాతం, పశువుల రైతులకు 90శాతం ఇవ్వడం సరైంది కాదని పేర్కొన్నారు. గొర్రెల షెడ్లకు కూడా 90శాతం ఇవ్వాలని కోరారు. యూనిట్ల సంఖ్య పెంచాలని అన్నారు. గ్రామానికి కనీసం 10మందికి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రతిఏటా జీవాలు వరదల్లో, రోడ్ ప్రమాదాల్లో, కుక్కల దాడుల్లో, వివిధ రకాల జబ్బులకు గుర్రై మృత్యువాత పడుతున్నాయని తెలిపారు. దీనివలన పెంపకం దారులు ఆర్థికంగా తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. కాబట్టి బీమా పథకాన్ని పునరుద్ధరించి అన్ని గొర్రెలకు ఉచితంగా భీమా చేయాలని కోరారు. గొర్రెకు రూ.10వేలు నష్టపరిహారం ఇవ్వాలని మహాసభ తీర్మానించినట్లు తెలిపారు. సభ తీర్మానాల అమలుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం స్పందించని పక్షంలో పెంపకం దారులు ఐక్యమై పోరాటాలకు సిద్ధం కావాలని కోరారు.

నూతనకమిటీ ఇదే..

జిఎంపిఎస్ జిల్లా నూతన కమిటీ ఎన్నిక

జిల్లా అధ్యక్షులుగా మద్దిన శేషు, ప్రధాన కార్యదర్శిగా బుర్రి ఆంజనేయులు మరో 16 మందిని కమిటీ సభ్యులుగా మహాసభ ఏకగ్రీవంగా ఆమోదించి ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిఎంపిఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి తోట తిరుపతరావు, ప్రజా సంఘాల నాయకులు సిహెచ్ గంగయ్య, కమిటీ సభ్యులు గవిని వెంకటరావు, మసనం వెంకటేశ్వర్లు, వడ్లమూడి వెంకటేశ్వర్లు, మల్లారపు వెంకటేశ్వర్లు, దబ్బకూటి ఎలమంద, గవిని కోటేశ్వరరావు, నరహరి గంభీరామకృష్ణ, బుర్ల శ్రీను, పులి వెంకట్రావు, రావులపల్లి వీరయ్య, రత్తయ్య పాల్గొన్నారు.

టిడిపి అధికార ప్రతినిధిగా మహేంద్రనాథ్

ప్రజాశక్తి - చీరాల

మహేంద్రనాథ్

తెలుగుదేశం నియోజకవర్గ అధికార ప్రతినిధిగా ఎంఎల్ఎ ఎంఎం కొండయ్య చిన్న కుమారుడు మద్దులూరి మహేంద్రనాథ్ నియమితులయ్యారు. ఈ మేరకు శాసన సభ్యులు ఎంఎం కొండయ్య సోమవారం ప్రకటనలో తెలిపారు. నేటి నుండి నియోజకవర్గ స్థాయి తెలుగుదేశం కార్యక్రమాలు నిర్వర్తిస్తూ పార్టీ అభివృద్ధికి మహేంద్రనాద్ దోహదపడవలసిందిగా కోరారు. కావున టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సహకరించి పార్టీ అభివృద్ధి కృషి చేయాలని కోరారు.

చెస్‌పోటీల్లో ఉత్తమ ప్రతిభ అవార్డు

ప్రజాశక్తి - సంతమాగులూరు

చెస్ టోర్నమెంట్‌లో విద్యార్థికి ఉత్తమ ప్రతిభ అవార్డు

మండలంలోని పుట్టావారిపాలెం సమీపంలోని మన బాల భారతి పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థి గడ్డం సత్య మహేష్ రెడ్డి పల్నాడు జిల్లా కేసనపల్లి ఎంఎఎం కాలేజీలో ఓపెన్ చెస్ టోర్నమెంట్ రాష్ట్రస్థాయిలో సోమవారం నిర్వహించారు. ఏడు రౌండ్లకు గాను నాలుగు రౌండ్లలో విజయం సాధించి బెస్ట్ పెర్ఫార్మెన్స్ అవార్డు పొందారు. దీంతో పాఠశాల యాజమాన్యం, సిబ్బంది విద్యార్థి మహేష్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. చెస్ పోటీల్లో విద్యార్థికి శిక్షణ ఇచ్చి తీర్చిదిద్దిన గణిత ఉపాధ్యాయుడు రియాజ్, పిఈటి నాగరాజుకు పాఠశాల డైరెక్టర్ ఓ అంజిరెడ్డి అభినందనలు తెలిపారు.

కర్ర సాము పోటీలకు ఎంపికైన ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు

జాతీయ కర్రసాము పోటీలకు ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు

ప్రజాశక్తి - చెరుకుపల్లి

మండలంలోని ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు జాతీయ స్థాయి కర్ర సాము (సిలబం) పోటీలకు ఎంపిక అయ్యారు. గుంటూరులో ఆదివారం నిర్వహించిన 14వ రాష్ట్ర స్థాయి కర్ర సాము పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయికి ఎంపికైనట్లు పాఠశాల ఛైర్మన్ పైనం ఏడుకొండలురెడ్డి తెలిపారు. అండర్ 11, అండర్ 14, అండర్ 17 విభాగాల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయిలో పతకాలు సాధించి జాతీయ స్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. డి వేదాన్ష్ చౌదరి, ఎం తేజన్‌రెడ్డి, వై చేతన్, వై రాఘవ్, ఆర్ షణ్ముఖ వంశీ, ఎం మోక్షనాద్ విజయం సాధించి జాతీయ స్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. గెలుపొందిన విద్యార్థులను వైస్ ఛైర్మన్ పైనం గణేష్‌రెడ్డి, సెక్రటరీ సాయి రంగారెడ్డి, పిడి నాంచారయ్య అభినందించారు. సెప్టెంబర్‌లో గోవాలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో ప్రాతినిద్యం వహించనున్నట్లు తెలిపారు.

ఎంపిడిఒగా ప్రద్యుమ్న కుమార్

ప్రజాశక్తి - పర్చూరు

ఎంపిడిఒగా ప్రద్యుమ్న కుమార్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. జెడ్‌పి సిఇఒ ఉత్తర్వుల మేరకు తాను బాధ్యతలు స్వీకరించినట్లు తెలిపారు. సమస్యల పరిష్కారంపై దృష్టి పెడతామని అన్నారు. ఆయనకు కార్యాలయ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు వైభవంగా నిర్వహించాలి

కలెక్టర్ జె వెంకట మురళి

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

స్వాతంత్ర దినోత్సవాన్ని వైభవంగా నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ జె వెంకట మురళి సూచించారు. జిల్లా అధికారులతో స్థానిక కలెక్టరేట్‌లో ఆయన సోమవారం సమావేశం నిర్వహించారు. అనంతరం పోలీస్ కవాతు మైదానంలో మైదానంలో పర్యటించారు. అక్కడ జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. స్వాతంత్ర దినోత్సవ వేడుకల రోజు వర్షాలు కురిసినా ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. జిల్లా అభివద్ధిని చాటి చెప్పేలా శకటాల ప్రదర్శన ఉండాలన్నారు. ప్రజలు, అధికారులకు తాగునీటి సౌకర్యం కల్పించాలన్నారు. జాతీయ పండుగ ప్రజలను అలరించేలా ఉండాలని, సాంస్కతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. పోలీసుల కవాతు కనువిందు చేసేలా సిద్ధం కావాలన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు అర్థమయ్యేలా స్టాల్స్ ప్రదర్శించాలన్నారు. కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ బి సుబ్బారావు, డిఆర్ఒ సిహెచ్ సత్తిబాబు పాల్గొన్నారు.

సమరయోధులకు నివాళులర్పిస్తున్న నరేంద్ర వర్మ

క్విట్ ఇండియా ఉద్యమంలో అద్వితీయమైన పాత్ర

ప్రజాశక్తి - బాపట్ల

క్విట్ ఇండియా ఉద్యమంలో అద్వితీయమైన పాత్ర బాపట్ల ప్రజలు పోషించినట్లు శాసన సభ్యులు వేగేశన నరేంద్రవర్మ చెప్పారు. 82వ క్విట్ ఇండియా దినోత్సవం సందర్భంగా ఫోరం ఫర్ బెటర్ ఆద్వర్యంలో ఎంపిడిఒ కార్యాలయం వద్దనున్న సమరయోధుల శిలాఫలకం వద్ద సమరయోధులకు నివాళులర్పించారు. బాపట్ల వాసులు ఆందోళనలు చేపట్టి బ్రిటిష్ వారి గుండెల్లో రైళ్ల పరిగెత్తించారని అన్నారు. పిట్టలవానిపాలెం మండలం కోడూరులో సిసి రోడ్డు నిర్మాణానికి ఎంఎల్ఎ నరేంద్ర వర్మ శంకుస్థాపన చేశారు. పట్టణంలో తూర్పు సత్రంలో నిర్మాణ దశలో ఉన్న భావనారాయణ స్వామి రథాన్ని పరిశీలించారు. రెండు నెలల్లో రథం నిర్మాణం పూర్తిచేయనున్నట్లు శిల్పులు తెలిపారని అన్నారు. కార్యక్రమంలో తహశీల్దారు కృష్ణకాంత్, ఫోరం కార్యదర్శి డాక్టర్ పిసి సాయిబాబు, పమిడి భాస్కరరావు, గొలపల శ్రీనివాసరావు, హనుమాన్జి, బి బాబురావు, సురేష్, జనసేన నాయకులు నామన శివన్నారాయణ, చందోలు మండల అధ్యక్షులు అఫ్జల్, అశోక్ పాల్గొన్నారు.

బిఆర్‌కె హైస్కూల్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - వేటపాలెం

విద్యార్థులను అభినందిస్తున్న కరస్పాండెంట్ రాధాకృష్ణ

యలమంచిలి ఫౌండేషన్ ఆధ్వర్యంలో విఆర్ఎస్ అండ్ వైఆర్ఎన్ కళాశాల సౌజన్యంతో స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా మండల స్థాయి క్విజ్, వక్తృత్వ, వ్యాస రచన పోటీల్లో కొత్తపేట బిఆర్‌కె హైస్కూల్ విద్యార్థులు విశేష ప్రతిభ కనబర్చి ప్రశంసలు అందుకున్నారు. ఆగస్టు 9న స్థానిక బాలికోన్నత పాఠశాలలో నిర్వహించిన మండల స్థాయి క్విజ్, వక్తృత్వ పోటీ పరీక్షల్లో సీనియర్స్, జూనియర్స్ విభాగాల్లో బిఆర్‌కె హైస్కూల్ విద్యార్థులు ప్రథమ స్థానంలో నిలిచారు. వక్తృత్వ పోటీలో సీనియర్స్ విభాగంలో 9వ తరగతి విద్యార్థిని ఎం సహస్ర, జూనియర్స్ విభాగంలో 7వ తరగతి విద్యార్థి జి వెంకట అక్షయ్ ప్రథమ స్థానంలో నిలిచారు. క్విజ్ పోటీలో సీనియర్స్ విభాగంలో 10వ తరగతి విద్యార్థులు వి రవిచరణ్ శ్రీనివాస్, వై సుశాంక్, శ్రీ విష్ణు, 9వ తరగతి విద్యార్థిని కె సాయి శ్రీచరిత టీమ్, జూనియర్స్ విభాగంలో 7వ తరగతి విద్యార్థి ఎస్ పార్థసారథి, 6వ తరగతి విద్యార్థిని బి వెంకట లక్ష్మీ ప్రణవి, 8వ తరగతి విద్యార్థి టి ధీరజ్ టీమ్ ప్రథమ స్థానంలో నిలిచారు. వ్యాస రచన పోటీలో సీనియర్స్ విభాగంలో 9వ తరగతి విద్యార్థిని ఎ సాయిసాహితి తృతీయ స్థానం పొందారు. ఈ సందర్భంగా హైస్కూల్లో జరిగిన అభినందన సభలో ప్రతిభ చూపిన విద్యార్థినీ, విద్యార్థులను ప్రిన్సిపాల్, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ బి రాధాకృష్ణ అభినందించారు.

ఆహార కల్తిపై వర్క్‌షాప్‌లో డాక్టర్ వి మోహనరావు

ఆహార కల్తీపై అవగాహన

ప్రజాశక్తి - అద్దంకి

సింగరకొండ కట్టా రామ కోటేశ్వరరావు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ వి మోహనరావు అధ్యక్షతన కళాశాల వృక్షశాస్త్రం, రసాయన శాస్త్రం విభాగాలు సంయుక్తంగా విద్యార్థుల ద్వారా ప్రయోగపూర్వకంగా ఆహార కల్తీని గుర్తించడానికి అవసరమైన పరీక్షలను ప్రయోగాత్మకంగా సోమవారం ప్రదర్శించారు. విద్యార్థులను ఆహ్వానించి ఆహార కల్తీపై అవగాహన కల్పించారు. ఆహార డైరీని పరీక్షించి వివిధ పరీక్షలు కలిగిన తన పుస్తకాలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో హేమలత, డి రాజశేఖర్, వి రామకృష్ణుడు, అధ్యాపక, అధ్యాపకేత్ర సిబ్బంది, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

అర్జీల పరిష్కారానికి చర్యలు : ఆర్‌డిఒ

ప్రజాశక్తి - రేపల్లె

వినతులు స్వీకరిస్తున్న ఆర్‌డిఒ హేలా షారోన్

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వస్తున్న అర్జీలను ప్రత్యేక దృష్టితో పరిష్కరించాలని ఆర్డీఒ హేలా షారోన్ అన్నారు. స్థానిక ఆర్‌డిఒ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆమె అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజా సమస్యలకు మెరుగైన పరిష్కారం చూపించాలనే ఆశయంతో రాష్ట్ర ప్రభుత్వం సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తుందన్నారు. మండలంలోని నల్లూరు నార్త్ గ్రామానికి చెందిన దట్టెంపూడి బుచ్చి రామకృష్ణ స్మశానం పోరంబోకు డొంక రోడ్డును సర్వే చేయించాలని కోరుతూ అర్జీ అందజేసారని తెలిపారు. పుట్టగుంట బుచ్చి రామయ్య, కొల్లి శేషుకృష్ణ అక్రమంగా త్రవ్విన రొయ్యల చెరువులను నిలిపివేయాలని, కొల్లి శేషుకృష్ణ రొయ్యల చెరువుల సాగు కోసం బోర్ల ద్వారా నీరు తోడుటం వలన గ్రామంలోని మంచినీరు కాస్త ఉప్పునీరుగా మారుతుందని, కావున ఆ బోర్లను రద్దు చేయాలని కోరుతూ అర్జీ ఇచ్చారని చెప్పారు. మోర్‌తోట గ్రామం నుండి దివి మారుతి రామాలయం గుడి భూమి నందు కంతేటి సాంబశివరావు అను వారు మట్టిని అడ్డంగా వేయడం వలన రహదారి రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడిందని, మట్టిని తొలగించాలని కోరారని తెలిపారు. ప్రజా ఫిర్యాదులపై విచారణ జరిపి త్వరగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

'మీకోసం' అర్జీలు

సహేతుకంగా పరిష్కరించండి

- మొక్కుబడి సమాధానాలు సహించబోను
- ఉన్నతాధికారుల తీరు మారకపోతే మెమోలు
- కలెక్టర్ తమీమ్ అన్సారియా

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ప్రజా సమస్యల పరిష్కారవేదిక 'మీకోసం' కార్యక్రమంలో వచ్చిన ప్రతి అర్జీని సీరియస్‌గా పరిగణనలోకి తీసుకొని సకాలంలో సహేతుకంగా పరిష్కరించాలని కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా పునరుద్ఘాటించారు. ప్రకాశం భవనంలో 'మీకోసం' కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రజల నుంచి ఆర్జీలు, ఫిర్యాదులను స్వీకరించారు. మొత్తం 196 ఆర్జీలు వచ్చాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 'మీకోసం' కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. ఆర్జీలను పరిష్కరిస్తున్న తీరును ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి అధికారులు పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. మొక్కుబడి సమాధానాలతో అర్జీదారులకు ఎండార్స్‌మెంట్ ఇచ్చి సమస్యను పరిష్కరించినట్లుగా రికార్డులలో చూపితే సహించబోనన్నారు. క్షేత్రస్థాయిలో పనుస్య పరిష్కారం కావాల్సిందేనని, పరిష్కరించలేకపోతే అందుకు కారణాలను కూడా అర్జీదారులకు వివరించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఇప్పటికీ కొన్ని శాఖలు నిర్దిష్ట గడువులోగా సమస్యను పరిష్కరించకపోగా, కొన్ని శాఖలు అసలు ఆ అర్జీలనే చూడకపోవడంపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉన్నతాధికారుల తీరు మారకపోతే మెమోలు

వికలాంగుడితో మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఇస్తామని హెచ్చరించారు. 'మీకోసం' కార్యక్రమానికి హాజరు విషయంలోనూ సమయపాలన పాటించాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

వికలాంగుడితో మాట్లాడిన కలెక్టర్

ఒ వికలాంగుడు గ్రీవెన్స్ హాలులోకి వచ్చాడు. అతన్ని చూసి కలెక్టర్ వేదికపైనుంచి కిందకు దిగి వచ్చారు. ఆ వికలాంగుడితో ప్రత్యేకంగా మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. తాను ఉలిచి గ్రామం నుంచి వచ్చానని, పేరు మేడా రామకష్ణ అని వికలాంగుడు కలెక్టర్‌కు తెలిపారు. ప్రస్తుతం ఆరు వేలు చొప్పున పెన్షన్ వస్తుందని, రూ.15 వేలకు పెంచేలా చూడాలని కోరారు. కలెక్టర్ స్పందిస్తూ నిబంధనల ప్రకారం పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. అదేవిధంగా జీవనోపాధి కోసం ఏదైనా షాపు ఏర్పాటు చేసుకోవడానికి బ్యాంకు రుణం ఇప్పించాలని అతడు కోరగా కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ ఆర్.గోపాలకష్ణ, డిఆర్ఒ విశ్వేశ్వరరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు

అర్జీదారులలో మాట్లాడుతున్న బాపట్ల కలెక్టర్ వెంకట మురళీ

ఝాన్సీలక్ష్మి, వరకుమార్, లోకేశ్వరరావు, అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

బాపట్ల జిల్లా : ప్రజా సమస్యల పరిష్కార వేదిక మీకోసం కార్యక్రమంలో వచ్చిన అర్జీలను తక్షమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో మీకోసం కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి కలెక్టర్ అర్జీలు స్వీకరించారు. మొత్తం155 అర్జీలు వచ్చాయి. తన పరిధిలోని వాటికి అక్కడికక్కడే పరిష్కారంచూపారు.

15 నుంచి రెవెన్యూ సదస్సులు

ఈనెల 15 నుంచి సెప్టెంబర్ 30 వరకూ జిల్లాలో రెవన్యూ సదస్సులు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. 277 రెవెన్యూ గ్రామాలలో 45 రోజులపాటు సదస్సులు జరుగుతాయన్నారు. రెవెన్యూ సదస్సుల నిర్వహణపై ముందస్తు ప్రణాళిక రూపొందించుకోవాలని అధికారులను ఆదేశించారు. తహశీల్దారు, ఎంపిడిఒ, అటవీశాఖ, సర్వే ల్యాండ్స్ రికార్డుల, దేవాదాయ శాఖ అధికారులతో మండల స్థాయి బందాలు నియమించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంయుక్త కలెక్టర్ బి.సుబ్బారావు, జిల్లా రెవెన్యూ అధికారి సిహెచ్.సత్తిబాబు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఆందోళన చేస్తున్న కార్మికులు

కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని మున్సిపల్ కార్యాలయం ముట్టడి

ప్రజాశక్తి-మార్కాపురం

టిడిపి అధికారంలోకి వచ్చిన తరువాత మార్కాపురం మున్సిపాలిటీలో కార్మికులను తొలగించే పనిలో ఉందని, తొలగించిన కార్మికులందరినీ విధుల్లోకి తీసుకోవాలని సిఐటియు జిల్లా కార్యదర్శి డికెఎం.రఫి డిమాండ్ చేశారు. తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ మున్సిపల్ కార్యాలయాన్ని సోమవారం ముట్టడించారు. ఈ సందర్భంగా రఫి మాట్లాడుతూ ఇంజినీర్ విభాగంలో గత 20 సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్న కార్మికులను ఎలాంటి కారణం లేకుండా తొలగించడం అన్యాయమన్నారు. కొందరిని విధులకు రావద్దని కమిషనర్ ఇ.కిరణ్ చెప్పడం సరికాదన్నారు. తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోని పక్షంలో ఆందోళన తీవ్రతరం చేస్తామన్నారు. అనంతరం కమిషనర్ ఇ.కిరణ్‌తో సమస్యపై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి డి.సోమయ్య, యూనియన్ అధ్యక్షుడు కె.సుబ్బరాయుడు, హరి, రమణ, శ్రీను, శేషిరెడ్డి, నాసరయ్య తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు

ఎస్‌పి తుషార్ దూడి

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

ఫిర్యాదుదారుల సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించ బోమని ఎస్‌పి తుషార్ డూడి అధికారులను హెచ్చరించారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని సోమవారం నిర్వంచారు. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను ఎస్‌పికి స్వయంగా వివరించి అర్జీలు అందజేశారు. భూ వివాదాలు, కుటుంబ కలహాలు, ఆర్థిక లావాదేవీల మోసాలు తదితర సమస్యలపై 49 మంది ఎస్‌పి అర్జీలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్‌పి టిపి. విఠలేశ్వర్ , ఇన్‌స్పెక్టర్ సిహెచ్.సింగయ్య , ఇతర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

ఫిర్యాది దారులతో మాట్లాడుతున్న ఎస్‌పి



డాక్టరేట్ అందుకుంటున్న నందూరి కార్తీక్

కార్తీక్‌కు డాక్టరేట్ ప్రదానం

ప్రజాశక్తి - భట్టిప్రోలు

వేమూరు మండలం కోడిపర్రు గ్రామానికి చెందిన కార్తీక్ ఫౌండేషన్ ఫౌండర్ నందూరి కార్తీక్ గౌరవ డాక్టరేట్ అందుకున్నారు. విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు, అనేక రకాల సేవా కార్యక్రమాలు నిర్వహించినందుకు హైదరాబాద్‌లోని మనం ఫౌండేషన్ అధ్యక్షులు కడపగండ్ల చక్రవర్తి చేతులమీదుగా కార్తీక్‌కు డాక్టరేట్ అందించి సన్మానించారు. సిటీ కల్చరల్ సెంటర్‌లో ఆదివారం నిర్వహించి సభలో అందజేసినట్లు ఫౌండేషన్ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో వివిధ కళ, సేవా రంగాలకు చెందిన పలువురు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అధ్యక్ష పదవికి రాజీనామా

ప్రజాశక్తి - భట్టిప్రోలు

ఏడుకొండలు

కాంగ్రెస్ మండల అధ్యక్షులు నిజాంపట్నం ఏడుకొండలు తన అధ్యక్ష పదవికి, కాంగ్రెస్ సభ్యత్వానికి రాజీనామా చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన వ్యక్తిగత కారణాలు వలన కాంగ్రెస్‌కు దూరంగా ఉండాలని భావించి రాజీనామా చేస్తున్నట్లు చెప్పారు. తన రాజీనామా పత్రాన్ని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు గంట అంజిబాబుకు పంపించినట్లు తెలిపారు. తన భవిష్యత్తు కార్యాచరణ తరువాత తెలియజేస్తానని తెలిపారు.

ప్రతిజ్ఞ చేస్తున్న ఎన్‌సిసి విద్యార్థులు

నషాముక్త్ భారత్ అభియాన్ ప్రతిజ్ఞ

ప్రజాశక్తి - నగరం

స్థానిక శ్రీ వెలగపూడి రామకృష్ణ స్మారక కళాశాలలో ఎన్‌సిసి క్యాడేట్స్ ద్వారా నషా ముక్త్ భారత్ అభియాన్ ప్రతిజ్ఞ సోమవారం చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ అనగాని హరికృష్ణ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వినియోగాన్ని అరికట్టడంలో ప్రభుత్వ నిబద్ధతకు నషా ముక్త్ భారత్ అభియాన్ నిదర్శనంగా నిలుస్తోందని చెప్పారు. యువతలో మాదకద్రవ్యాల వినియోగాన్ని నిరోధించాలని అన్నారు. మాదక ద్రవ్యాల వల్ల అనర్థాలపై అవగాహన కల్పించాలని అన్నారు. ఆరోగ్యకరమైన జీవన సంస్కృతిని పెంపొందించేందుకు నషా ముక్త్ భారత్ అభియాన్ దోహదపడుతుందని చెప్పారు. కార్యక్రమంలో ఎన్సిసి ఆఫీసర్ వి సాంబమూర్తి, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి - పర్చూరు

పుస్తకాలు అందజేస్తున్న వెంకటేశ్వర్లు

స్థానిక ఇందిరా కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో 76 మంది విద్యార్థులకు నూతలపాడుకు చెందిన చిమట వెంకటేశ్వర్లు వ్రాత పుస్తకాలు సోమవారం అందజేశారు. తాను గత 15ఏళ్ల నుండి వివిధ పాఠశాలల్లో విద్యార్థులకు ఉచితంగా వ్రాత పుస్తకాలు అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పి నాగమణి, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యార్థి హత్య కేసును ఛేదించిన పోలీసులు

- వివరాలు వెల్లడించిన ఎఎస్పీ విఠలేశ్వర్
- ఆరుగురు అరెస్టు, పరారీలో మరో ఇద్దరు నిందితులు
- సిబ్బందిని అభినందించిన ఎస్పీ తుషార్ డూడి

ప్రజాశక్తి - చీరాల

మృతి చెందిన విద్యార్థి

మండలంలోని ఆదినారాయణపురంలో ఈ నెల 6న జరిగిన విద్యార్థి అమీన్ ఆరిఫ్ (18) హత్య కేసులో నింధితులను పోలీసులు అరెస్టు చేశారు. మృతుని స్నేహితుడు కోడూరి మనోజ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు 2వ పట్టణ పోలీసులు కేసును ఛాలెంజ్‌గా తీసుకొని ధర్యాప్తు చేశారు. 2వ పట్టణ పోలీస్ స్టేషన్లో అడిషనల్ ఎస్పీ విఠలేశ్వరరావు కేసు వివరాలను సోమవారం వెల్లడించారు. ఈపురిపాలెం గ్రామానికి చెందిన సయ్యద్ అమీన్ ఆరిఫ్ (18), అతని స్నేహితుడు కొండూరు సత్య మనోజ్ ఇద్దరు ఈ నెల 6న రాత్రి సుమారు 9గంటల 45నిమిషాల సమయంలో మృతడు సైకిల్‌పై తన స్నేహితుడు మనోజ్ మోటార్ సైకిల్ మీద ఆదినారాయణపురం మీదగా వెళ్ళుచుండగా వారి వెనకనే ఎపి 07 డిడి 9603 నెంబరు గల కారులో వచ్చిన బాపట్ల మండలం వెదులపల్లికి చెందిన మల్లె సందీప్ ప్రసన్న కుమార్ అలియాస్ సందీప్, చీరాల మండలం పాపరాజుతోటకు చెందిన గరిక మహేంద్ర, కొత్తపేటకు చెందిన షేక్ జిలాని అలియాజ్ జిల్లు భాయ్, బాపట్లకు చెందిన షేక్ మహమ్మద్ రియాజ్, కావాలి ప్రాంతంకు చెందిన పాశం లక్ష్మీనారాయణ అలియాస్ లక్ష్మణ్, స్టువర్టుపురంకు చెందిన దేవరకొండ శ్రీనివాస రావు అలియాస్ శ్రీను, చీరాల మండలం రామనగర్ న్యూ కాలనీకి చెందిన అంగడి సుకుమార్, చీరాల మండలం రామకృష్ణాపురంకు చెందన కర్రేద్దుల వంశీ వారి ఇద్దరని ఆపి అపహేళన చేసి, వారి మీద గొడవ పెట్టుకున్నారని ఎఎస్పి తెలిపారు. అంతటితో ఆగక ముద్దాయిలు తమ కారులోని కత్తి తీసుకొని సందీప్, గరిక మహేంద్ర ఇద్దరు ఆరిఫ్‌ను విచక్షణ రహితంగా పొడిచి చంపివేశారని తెలిపారు. అనంతరం ముద్దాయిలు అదే కారులో పారిపోయారని అన్నారు. సయ్యద్ అమీన్ ఆరిఫ్ హత్యకు గురికావడంతో హతుడి స్నేహితుడు కొండూరి సత్య మనోజ్ ఫిర్యాదు మేరకు 2వ పట్టణ పోలీసు స్టేషన్‌లో 173/2024 యు/ఎస్ 103 (1),115 (2) ఆర్/డబ్ల్యు 3(5) బిఎన్ఎస్ సెక్షన్ల క్రింద కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఎస్పీ తుషార్ డూడి స్వయంగా నేర స్థలం సందర్శించి, క్షుణ్ణంగా పరిశీలించారని అన్నారు. హత్య కేసును త్వరితగతిన ఛేదించేందుకు ఎఎస్పీ టిపి విఠలేశ్వర్ ఆధ్వర్యంలో డీఎస్పీ జగదీష్ నాయక్, నలుగురు సిఐలు, ఐదుగురు ఎస్ఐలు, 30మంది పోలీసు సిబ్బందితో ఏడు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు. టూ టౌన్ సిఐ జి సోమశేఖర్ ప్రత్యక్షులు, మృతుని కుటుంబ సభ్యులు, ఇతర సాక్షులు చెప్పిన సమాచారం ఆధారంగా పరిశీలించి భౌతిక సాక్ష్యాధారాలను పరిగణలోకి తీసుకొని విచారణ చేపట్టినట్లు తెలిపారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి సోమవారం సాయంత్రం ఆరున్నరకు ఆరుగురు నిందితులు, మధ్యవర్తుల సమక్షంలో ఆరుగురు నిందితులను చీరాల నుండి ఓడరేవు వెళ్లే రోడ్డులో బుర్లవారిపాలెం పోవు రోడ్డు వద్ద వున్న ప్లాట్ల దగ్గర ఉండగా సిఐ సోమశేఖర్ సిబ్బందితో అరెస్టు చేశారని తెలిపారు. ముద్దాయిల నుండి హత్యకు ఉపయోగించిన కత్తిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ముద్దాయిలను కోర్టులో హాజరు పర్చనున్నట్లు తెలిపారు. ఘటనలో 8మందిలో గరిక మహేంద్ర, కర్రెద్దుల వంశి అనే ఇద్దరు పరారీలో ఉన్నారని తెలిపారు. ఆ ఇద్దరినీ త్వరలో పట్టుకుంటామని తెలిపారు. ముద్దాయిల్లో పలువురిపై రౌడీషీట్లు, అనేక కేసులు వివిధ పోలీసు స్టేషన్లలో నమోదైనట్లు తెలిపారు. కేసు దర్యాప్తు వేగవంతంగా నిర్వహించి ముద్దాయిపై చార్జి షీట్ దాఖలా చేసి న్యాయస్థానంలో కఠిన శిక్ష పడే విధంగా చర్యలు తీసుకుంటామని అన్నారు. కేసు ఛేదనలో విశిష్ట కృషి చేసిన ఎఎస్పీ టిపి విఠలేశ్వర్, చీరాల, బాపట్ల డిఎస్పీలు జగదీష్ నాయక్, మురళి కృష్ణ, చీరాల టూ టౌన్, ఒన్ టౌన్, చీరాల రూరల్, ఇంకొల్లు, అద్దంకి రూరల్, బాపట్ల టౌన్ సిఐలు, 8మంది ఎస్ఐలను, స్పెషల్ టీమ్, సీసీఎస్ సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

వివరాలు వెల్లడిస్తున్న ఎఎస్పీ టిపి విఠలేశ్వర్

జీవామృతంతో తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు

ప్రజాశక్తి - చెరుకుపల్లి

వరి పొలాల్లో వచ్చే సూక్ష్మధాతులోపాల పట్ల రైతులు గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా వనరుల కేంద్రం, రైతు శిక్షణ కేంద్రం ఎడిఎ అక్తర్ హుస్సేన్ రైతులకు సూచించారు. మండలంలోని కావూరు పంచాయతీలో క్షేత్ర స్థాయిలో వరి పొలాలను సందర్శించారు. ఆయనతోపాటు ఏరువాక శాస్త్రవేత్త, కో ఆర్డినేటర్ డాక్టర్ బాల మురళీధర్ నాయక్, డాట్ సెంటర్ శాస్త్రవేత్త జె రాధాకృష్ణ వెద పెట్టిన పొలాలు, నాట్లు వేసిన పొలాల్లో కలుపు, ఎరువుల యాజమాన్యం గురించి రైతులకు వివరించారు. వరిలో వచ్చే సూక్ష్మ ధాతు లోపాలైన జింకు, ఇనుప ధాతు లోపాలను గుర్తించి నివారించే పద్ధతులను రైతులకు వివరించారు. అనంతరం ప్రకృతి వ్యవసాయంలో భాగమైన ద్రవ జీవామృతం, ఘన జీవామృతం, బీజమృతం తయారీ విధానాలు, వాటి ఉపయోగాలను రైతులకు వివరించారు. జీవామృతాలు వాడటం వల్ల తక్కువ ఖర్చుతో అధిక నాణ్యమైన, ఆరోగ్యవంతమైన దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఎఒ టి బాలాజీ గంగాధర్, ప్రకృతి వ్యవసాయం మాస్టర్ ట్రైనర్ బాల పాప, ఎఇఒలు, విఎఎలు పాల్గొన్నారు.

జీవామృతం తయారీని పరిశీలిస్తున్న ఎడిఎ అక్తర్ హుస్సేన్

పాఠశాలకు మైక్‌సెట్ బహూకరణ

ప్రజాశక్తి - అద్దంకి

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో కురిచేటి వెంకట సుబ్బారావు (చిన్ని) ధర్మపత్ని అలేఖ్య జ్ఞాపకార్థం స్టేట్ బ్యాంకు కాలనీలోని ఎపి గిరిజన గురుకుల పాఠశాలకు మైక్ సెట్‌ను సోమవారం బహుకరించారు. రోటరీ అధ్యక్షులు చప్పిడి వీరయ్య మాట్లాడుతూ ప్రభుత్వ గిరిజన గురుకుల పాఠశాలకు మైక్ సెట్ బహుకరించిన కురిచేటి వెంకట సుబ్బారావు అభినందనీయులని పేర్కొన్నారు. హాస్టల్లో చదువుకునే విద్యార్థులు మంచి అలవాట్లుతో క్రమశిక్షణతో బాగా ఇష్టపడి కష్టపడి చదివి మంచి స్థితికి రావాలని కోరారు. ప్రిన్సిపాల్ పురుషోత్తం మాట్లాడుతూ రోటరీ ప్రతినిధులు గతంలో కూడా తమ స్కూల్‌కు అవసరమైన సహాయం చేశారని అన్నారు. మైక్ సెట్ అందించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. దాత కురిచేటి వెంకటసుబ్బారావును శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో రోటరీ కార్యదర్శి చుండూరి మురళి సుధాకరరావు, చిన్ని మురళీకృష్ణ, పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి, అళహరి హరిప్రసాద్, పువ్వాడ రామకోటేశ్వరావు, అన్నంగి సుబ్బారావు, తమ్మన శ్రీనివాసరావు, కొల్లా భువనేశ్వరి పాల్గొన్నారు.

గిరిజన పాఠశాలకు మైక్‌సెట్ అందజేస్తున్న దాతలు

జ్యోతి చంద్రమౌళిని సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

'సూక్తి సుధలు' గ్రంథం ఓ ఆణిముత్యం

ప్రజాశక్తి - అద్దంకి

విద్వాన్ జ్యోతి చంద్రమౌళి రచించిన 'సూక్తి సుధలు' ఖండ కావ్యం ప్రకాశం బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో సోమవారం ఆవిష్కరించారు. గ్రంథం ఆణిముత్యమని ఆచార్య విస్తాలి శంకరరావు అన్నారు. ఉపాధ్యాయులు వి లక్ష్మీనారాయణ సభాహ్వానం పలికారు. హెచ్‌ఎం డి సువర్ణ పద్మావతి అధ్యక్షత వహించారు. మద్రాసు యూనివర్సిటీ తెలుగు శాఖాధ్యక్షులు ఆచార్య విస్తాలి శంకరరావు గ్రంథ ఆవిష్కరణ చేశారు. తొలి ప్రతిని పిఇటి మక్కెన నాగయ్యకు అందజేశారు. రిటైర్డ్ ఆర్జెడి యు దేవపాలన, అన్నమనేని వెంకటరావు గ్రంథ సమీక్ష చేశారు. ఈసందర్భంగా రచయిత చంద్రమౌళిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వీరవల్లి సుబ్బారావు, డాక్టర్ చుక్కా నాగభూషణం, డాక్టర్ కాకాని సుధాకర్, దివాకర్ దత్తు, చప్పిడి వీరయ్య, జి వీరాంజనేయులు, చెన్నుపల్లి నాగేశ్వరరావు, జ్యోతి శ్రీమన్నారాయణ మూర్తి, జ్యోతి రమేష్ పాల్గొన్నారు.

లారీ ఢీకొని మహిళ మృతి

ప్రజాశక్తి - వేమూరు

మండలంలోని పెరవలిపాలెం గ్రామానికి చెందిన కూచిపూడి జ్యోతి (39)ని తన కుమార్తె శ్వేత చూసేందుకు చేబ్రోలు మండలం వేజండ్ల నుండి పెరవలిపాలెం గ్రామానికి వచ్చి తిరిగి తన స్కూటీపై తల్లి కూచిపూడి జ్యోతిని తీసుకెళుతుండగా గ్రామ శివారు మలుపులో ఎదురుగా వస్తున్న లోడు లారీ సోమవారం స్కూటీని ఢీకొంది. ప్రమాదంలో తల్లి జ్యోతి కుమారి రోడ్డుపైకి పడిపోవటంతో లారీ వెనుక చక్రాలు జ్యోతి తలపైకి ఎక్కాయి. దీంతో మెదడుకు తీవ్ర గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృత దేహాన్ని పోస్టుర్టం నిమిత్తం తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి

ప్రజాశక్తి - బాపట్ల

ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే ప్రతి ఒక్కరు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సీఐ అహమ్మద్ రఫి సూచించారు. పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్ వద్ద ద్విచక్ర వాహన దారులకు హెల్మెట్ ధరించాలని సోమవారం కౌన్సిలింగ్ నిర్వహించారు. హెల్మెట్ లేకుండా ప్రయాణం చేస్తే ఏదైనా ప్రమాదం జరిగే ప్రాణాలకు ప్రమాదం ఉంటుందని సూచించారు. హెల్మెట్ ప్రాధాన్యత గుర్తించాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి - భట్టిప్రోలు

భట్టిప్రోలు విద్యుత్ ఉప కేంద్రం పరిధిలోని వెల్లటూరు ఫీడర్ కింద మరమ్మత్తుల కారణంగా మంగళవారం విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఇంచార్జి ఎఈ పి ఏడుకొండలు తెలిపారు. ఫీడర్ పరిధిలోని వెల్లటూరులో మాత్రమే ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు, పెదపులివర్రు విద్యుత్తు సబ్ స్టేషన్ పరిధిలోని పెసర్లంక ఫీడర్ కింద పెసర్లంక, పెదలంక గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. వినియోగ దారులు సహకరించాలని కోరారు.

ఎంపిడిఓ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - చిన్నగంజాం

కె స్వరూపరాణి

నూతన ఎంపిడిఒగా కె స్వరూపరాణి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో ఎన్‌విజికె మూర్తి, జూనియర్ అసిస్టెంట్ ఎన్ వేణు పాల్గొన్నారు.

సర్పంచులు, కార్యదర్శులకు శిక్షణ

ప్రజాశక్తి - యద్దనపూడి

స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు సోమవారం జిపిడిపిపై శిక్షణ నిర్వహించారు. ఇఒ పిఆర్ డి శ్రీనివాసరావు మాట్లాడుతూ పంచాయతీలో పారిశుధ్యం, రక్షిత నీటి నిర్వహణ, వీధి లైట్లు, విద్యుత్ చార్జిల నిర్వహణపై శిక్షణ ఇచ్చారు. పంచాయతీలో ఆర్థిక వనరులు పెంచుకునే విధంగా ప్రణాళికలు రూపొందించుకోవాలని అన్నారు. ఎఒ సుందరమ్మ, కార్యదర్శులు శరత్, భాగ్యరాజు, రాణి, శివ ప్రసాద్, శ్రీను, గోపి, గెస్సి, ప్రభాకర్, జెఎ చంద్రహస్ పాల్గొన్నారు.

సంతమాగులూరు : పంచాయతి పరిపాలనలో సర్పంచులు, కార్యదర్శులు పంచాయతీ రాజ్ చట్టంలోని సెక్షన్ 45, 46 ద్వారా నిర్వర్తించబడే ఐచ్చిక విధుల గురించి తప్పనిసరిగా అవగాహన చేసుకోవాలని ఇన్‌చార్జి ఎంపిడిఒ ఎన్ శివరామ ప్రసాద్, ఎంపీపీ ఎనుబర్ల ఎలమంద సూచించారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయ సమావేశం హాలులో మొదటిరోజు శిక్షణ సోమవారం ప్రారంభించారు. ముందుగా అంబేద్కర్, గాంధీజీ చిత్రపటాలకు పూల దండలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దుతామని చేతులెత్తి ప్రమాణం చేశారు. అనంతరం పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా ప్రజాప్రతినిధులకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచుల సంఘం మండల అధ్యక్షులు సన్నెబోయిన గురు యాదవ్, పంచాయతీ కార్యదర్శులు పూర్ణచంద్రరావు, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

భట్టిప్రోలు : ప్రజా ప్రతినిధులు, అధికారుల సమన్వయంతోనే గ్రామాభివృద్ధి సాధ్యమవుతుందని ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి అన్నారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో సర్పంచులు, కార్యదర్శులకు

భట్టిప్రోలు : చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న సర్పంచులు

రాష్ట్రీయ గ్రామ స్వరాజ్ అభియాన్‌పై సోమవారం శిక్షణ నిర్వహించారు. ఈసందర్భంగా మహాత్మా గాంధీజీ, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ చిత్రపటాలకు పూల మాల వేసి నివాళి అర్పించారు. పారిశుద్ధ్య పనులు, సంపద కేంద్రాల నిర్వహణ, పంచాయతీ అభివృద్ధికి చేపట్టాల్సిన ప్రణాళికలను రూపొందించడం, ప్రజలకు స్వచ్ఛ తాగు నీటి సరఫరా వంటి కార్యక్రమాలపై మాస్టర్ ట్రైనర్లు ఎ చినవెంకటేష్ బాబు, వక్కలగడ్డ సురేష్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జడ్పిటిసి టి ఉదయభాస్కరి, ఎంపిడిఒ, ఇఒఆర్‌డి టి ఊహారాణి, ఎఒ సిహెచ్ జలజ, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఇంకొల్లు : స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో మండలంలోని 13 పంచాయతీల కార్యదర్శిలు, సర్పంచులకు మూడు రోజుల శిక్షణ సోమవారం ప్రారంభించారు. తొలిరోజు ఈఓఆర్డి కె శ్రీనివాసరావు పాలనాపరమైన సూచనలు, పంచాయతీ చట్టాలు వివరించారు. పంచాయతీ పారిశుద్ధ్యం, సేకరించిన తడి, పొడి చెత్తను కంపోస్ట్ ఎరువుగా తయారు చేయాలనే విధానాన్ని చెప్పారు. కంపోస్ట్ ఎరువుగా మారిన ఎరువును వ్యాపారం చేసి ఎలా ఉపయోగించుకోవాలనేదానిపై శిక్షణ ఇచ్చారు.

పర్చూరు : గ్రామాల్లో మూలన పడిన చెత్త సేకరణ కేంద్రాలను అభివృద్ధి చేసి వినియోగంలోకి తీసుక రావాలని ఈఒఆర్డి రామకృష్ణ సూచించారు. ఎవరూ చెత్తను బయట విసిరి పడేయ కూడదని తెలిపారు. స్థానిక ఎంఆర్‌సి ఆవరణలో కార్యదర్శులు, సర్పంచులకు ఒక రోజు శిక్షణ ఇచ్చారు. పంచాయతీకి వచ్చే ఆదాయ వనరులపై దృష్టి సారించాలన్నారు.

వేటపాలెం : పంచాయతీల్లో ఆర్థిక వనరులు పెంచుకునే విధంగా ప్రణాళికలు రూపొందించుకోవాలని ఎంపిడిఒ ఎంవిఎస్ శర్మ సూచించారు. స్థానిక ఐసిడిఎస్ సమావేశ హాలులో సర్పంచులు, కార్యదర్శుల శిక్షణ సోమవారం నిర్వహించారు. పారిశుధ్యం, రక్షిత నీటి నిర్వహణ, వీధి లైట్లు, విద్యుత్ చార్జిల నిర్వహణపై క్షుణ్ణంగా వివరించారు. రామన్నపేట పంచాయితీలో చెత్త సంపద కేంద్రాన్ని శిక్షణలో భాగంగా మంగళవారం సందర్శించాలని చెప్పారు. కార్యక్రమంలో రామన్నపేట పంచాయితీ సర్పంచ్ కందేటి రమణ, ఈఓపిఆర్‌డి ఎం శ్రీనివాసరావు, కార్యదర్శులు బడుగు రమేష్ బాబు, శవనం రాజశేఖరరెడ్డి, కొమ్మనబోయిన శివలీల, పర్ణం పూర్ణ కుమారి, పి శారద, బాలిగ సురేంద్ర పాల్గొన్నారు.

చిన్నగంజాం : చెత్త సంపద షెడ్ల నిర్వహణకు ప్రాధాన్యత ఇవ్వాలని ఈఒపిఆర్డి ఎన్‌విజికె మూర్తి అన్నారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయ సమావేశ హాలులో సర్పంచులు, కార్యదర్శుల శిక్షణ సోమవారం నిర్వహించారు. పంచాయతీ పరిపాలన, శానిటేషన్, ఎస్‌డబ్ల్యుపిసి షెడ్లు నిర్వహణ, పంచాయతీల తనిఖీ చేయు అధికారులు, విధులు విషయమై శిక్షణ ఇచ్చారు.

మాట్లాడుతున్న జిల్లా వైద్య అధికారి విజయమ్మ

గర్భిణుల ఆరోగ్యం పట్ల జాగ్రత్త

ప్రజాశక్తి - బాపట్ల

గర్భిణీల ఆరోగ్యం పట్ల వైద్య సిబ్బంది జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య ఆరోగ్య శాఖ జిల్లా అధికారి ఎస్ విజయమ్మ సూచించారు. జిల్లా వైద్య ఆరోగ్య కార్యాలయంలో శిశు మరణాలపై సోమవారం జరిగిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. పుట్టిన బిడ్డ పట్ల తల్లులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గర్భిణిగా ఉన్నప్పుడే అవగాహన కల్పించాలని అన్నారు. పుట్టిన బిడ్డలకు సకాలంలో అన్ని రకాల టీకాలు వేయించే విధంగా సమగ్రంగా వివరించాలన్నారు. సమావేశంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి టి వెంకటేశ్వర్లు, జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి డాక్టర్ శేషుకుమార్, ఎన్‌హెచ్‌ఎం ప్రోగ్రాం అధికారిని రోహిణి రత్నశ్రీ పాల్గొన్నారు.

ఎయిడ్స్ నియంత్రణపై అవగాహన

ప్రజాశక్తి - మేదరమెట్ల

హెచ్ఐవి బారిన పడకుండా యువతను కాపాడాలని స్థానిక పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ నిఖిల్ రెడ్డి అన్నారు. పిహెచ్‌సి ఆవరణలో సోమవారం ఏర్పాటు చేసిన ఎయిడ్స్ నియంత్రణ సదస్సులో ఆమె మాట్లాడారు. యువత ఎయిడ్స్ బారిన పడకుండా చూడాలని సూచించారు. సదస్సులో హెల్ప్ స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్ట్ నుండి బివి సాగర్, డాక్టర్ హరికృష్ణ, డాక్టర్ మనోజ్, డాక్టర్ హర్ష, పోలీస్ సిబ్బంది, అశోక్ ఔట్రిచ్ వర్కర్స్ దుర్గా, కరుణ, శ్రావణి, మల్లేశ్వరి, ఎఎన్‌ఎం రాధా పాల్గొన్నారు.

జీవ వైవిధ్య సంరక్షణపై అవగాహన

ప్రజాశక్తి - బాపట్ల

జీవవైవిధ్య పరిరక్షణ పట్ల బాల్య దశ నుండే విద్యార్థుల్లో అవగాహన పెంచాలని డిఇఒ జి వెంకటేశ్వర్లు అన్నారు. 'జీవ వైవిధ్యం సంరక్షణ - యువత పాత్ర' అంశంపై పట్టణంలోని సరస్వతి మెమోరియల్ పాఠశాల్లో విద్యార్థులకు జిల్లా స్థాయి వక్తృత్వ, వ్యాస రచన, క్విజ్ పోటీలు నిర్వహించారు. వివిధ మండలాల నుండి 62మంది విద్యార్థులు హాజరయ్యారు. జిల్లా సైన్స్ అధికారి మహమ్మద్ సాదిక్, ఎన్‌జిసి కో - ఆర్డినేటర్ పవని భాను చంద్రమూర్తి, ఆర్‌పి సికిందర్ మీర్జాన్ పర్యవేక్షించారు. అధ్యాపకులు సుమతి, అనిల్ కుమార్, కెవి శ్రీనివాసరావు, డి రాజేష్, మేరుగ లక్ష్మి న్యాయ నిర్ణేతలుగా వ్యవహరిం చారు. విజేతల వివరాలను జిల్లా సైన్స్ అధికారి ఎండి సాదిక్ ప్రకటించారు. కొండమంజులూరు జడ్పీ హైస్కూల్ విద్యార్థులు ప్రథమ, ఈపూరుపాలెం బాలికో న్నత పాఠశాల ద్వితీయ, బాపట్ల మున్సిపల్ హై స్కూల్ విద్యార్థులు తృతీయ స్థానంలో నిలిచారు. ఉపన్యాస పోటీల్లో కొండ మంజులూరు జడ్పి హైస్కూల్ విద్యార్థి వై సంధ్యారాణి, చక్రాయపాలెం జడ్పీ హైస్కూల్ విద్యార్థి ఎ అమృత, ఈపురుపాలెం జడ్పి హై స్కూల్ బాలురు పి శశాంక్ ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. వ్యాసరచన పోటీల్లో ఖాజీపాలెం జడ్పీ హైస్కూల్ విద్యార్థి ఎస్‌కె సుహానా, ఈపురుపాలెం బాలికోన్నత పాఠశాల విద్యార్థి పి సత్యవర్షిణి, బాపట్ల ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థి బి జ్ఞానతేజశ్రీ వరుస మూడు స్థానాల్లో నిలిచారు.

గంజాయి జోలికి వెళ్లొద్దు

ప్రజాశక్తి - బాపట్ల

పట్టణ పరిసరాల్లో అసాంఘిక చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ అహ్మద్ జానీ హెచ్చరించారు. పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థులు గంజాయి జోలికి వెళ్లి బంగారు భవిష్యత్తు నాశనం చేసుకోవద్దన్నారు. పటిష్టమైన పోలీసు నిఘా ఉంటుందన్నారు. కాలేజీల వద్ద సివిల్ దుస్తుల్లో పోలీసు నిఘా ఏర్పాటు చేస్తున్నామని అన్నారు.

జిల్లా కలెక్టర్‌మురళికి వినతి పత్రం ఇస్తున్న జర్నలిస్టులు

జర్నలిస్టు పిల్లలకు ఫీజు రాయితీ కల్పించాలి

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

జిల్లాలో వివిధ ప్రింట్, ఎలక్ట్రాన్ మీడియా సంస్థల్లో పనిచేస్తున్న జర్నలిస్టు పిల్లలకు ప్రైవేట్ స్కూల్స్, కాలేజీల్లో 50 శాతం ఫీజు రాయితీ, 15 శాతం సీట్ల కేటాయింపుకు అవకాశం కల్పించాలని కోరుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్ జె వెంకట మురళికి వర్కింగ్ జర్నలిస్టులు సోమవారం వినతి పత్రం అందజేశారు. ప్రింట్, ఎలక్ట్రాన్ మీడియా సంస్థల్లో విధులు నిర్వహిస్తున్న ఎస్‌సి, ఎస్‌టి, బీసీ, ఓబీసీ జర్నలిస్టుల పిల్లలకు సీట్లు కేటాయింపుతో పాటు ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థలలో రాయితీ ఇప్పించేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. అక్రిడేషన్ ప్రామాణికం లేకుండా అందరి జర్నలిస్టుల పిల్లలకు రాయితీ ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. దీంతో స్పందించిన కలెక్టర్ మాట్లాడుతూ జాయింట్ కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లాలోని విద్యా సంస్థల ప్రతినిధులు, మీడియా ప్రతినిధులతో సంయుక్త సమావేశం ఏర్పాటు చేసి ఫీజు, సీట్లు కల్పించే విషయంలో సహకారం అందించే విధంగా చర్యలు చేపడతామని తెలిపారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో జర్నలిస్టులు ధనరాజ్, నారాయణ, స్టాలిన్, శ్రీకాంత్, ప్రశాంత్, గుమ్మడి సూర్యప్రకాష్, బొల్లాపల్లి బెన్నిబాబు, సిహెచ్‌వి సుబ్బారావు, అనిల్, ఎన్ నాగార్జున ఉన్నారు.

13న వ్యాపారులకు శిక్షణ

ప్రజాశక్తి - ఇంకొల్లు

ఈనెల 13న జాతీయ ఆహార భద్రత, తనిఖీ విభాగం ఆధ్వర్యంలో జిల్లాస్థాయి శిక్షణ స్థానిక ఆర్య వైశ్య కళ్యాణ మండపంలో నిర్వహించనున్నారు. ఎపి ఫుడ్ సేఫ్టీ అధికారులు కె సురేంద్ర, ఎస్ సునీల్ ఆ శాఖ డైరెక్టర్ పూర్ణచంద్రరావు ఆదేశాల మేరకు ఎపి పోస్టాక్ నోడల్ అధికారి రవీంద్రారెడ్డి, ఎపిఎస్సి జి ప్రభాకర్ ఆధ్వర్యంలో జిల్లా అధికారులు దేవరాజు, జి ప్రవీణ్, ప్రణీత్ కుమార్ శిక్షకుడు కె ప్రవీణ్ కుమార్ శిక్షణ ఇస్తారని తెలిపారు.

తహశీల్దారుకు గిరిజనుల వినతి

ప్రజాశక్తి - రేపల్లె

ప్రభుత్వ సంక్షేమ పథకాలకు నోచుకోని అమాయక గిరిజన తెగలకు చెందిన కుటుంబాలు తీర ప్రాంతంలో బానిసలుగా బ్రతుకుతున్నారు. కాలవకట్లపై తాత్కాలిక నివాసాలు ఏర్పాటు చేసుకొని జీవిస్తున్న యానాదులకు ఆధార్ కార్డులు లేవు. ఈ నేపథ్యంలో టిడిపి ఎస్టి సెల్ రాష్ట్ర నాయకులు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో యానాదులకు ఆధార్ కార్డు నమోదు అవకాశం కల్పించాలని తహశీల్దారుకు వినతి పత్రం సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా గిరిజన సంఘ నాయకులు నాగేశ్వరరావు మాట్లాడుతూ అమాయక గిరిజన జాతులైన యానాదులకు ఉపాధి పనులు ఇప్పిస్తామని ఆశ చూపి ఆక్వా వ్యాపారులు బానిసలుగా వాడు కుంటున్నారని ఆరోపించారు. తీర ప్రాంతంలోని ఆక్వా సాగు చేస్తున్న రైతులు, వ్యాపారస్తులు వీరి అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని తీర ప్రాంతలకు తరలిస్తున్నారని చెప్పారు. ఊరికి దూరంగా సముద్ర తీరం వెంబడి మడ అడవుల్లో వీరిని గ్రూపులుగా విడగొట్టి వారి చేత పీతలు పట్టించి సొమ్ము చేసుకుంటున్నారని తెలిపారు. ఒక్క కుటుంబ పెద్దకు రూ.2వేల నుండి రూ.వేలు అప్పుగా ఇచ్చి వారిని

తహశీల్దారుకు వినతి పత్రం అందజేస్తున్న గిరిజనులు

బానిసలుగా మార్చి తీర ప్రాంతంలోని మడ అడవుల మధ్య పీతలు పట్టేందుకు ఉపయోగిస్తున్నారని అన్నారు. వీరు తీసుకున్న డబ్బులకు మూడు నెలలపాటు ఎన్ని పీతలు పట్టిన వారికే ఇవ్వాల్సి ఉంటుందని చెప్పారు. అనేక మంది యానాదులకు కనీసం ఆధార్ కార్డుకు నోచుకోలేదని గుర్తించారు. జీవించడం కోసం ఒకచోట నుండి మరో చోటికి వెళుతూ వలసవాద జీవితం గడిపే వీరికి ఆధార్ కార్డు లేకపోవడంతో ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందనంత దూరంలో ఉన్నాయని అన్నారు. అధికారులు స్పందించి గిరిజన యానాదులకు ఆధార్ కార్డులు వెంటనే మంజూరు చేయాలని కోరారు.

పాక్స్ కంప్యూటరైజేషన్ పూర్తి చేయాలి

ప్రజాశక్తి - అద్దంకి

పాక్స్ కంప్యూటరైజేషను త్వరగా పూర్తిచేయాలని ప్రకాశం జిల్లా సహకార బ్యాంక్ సీఈఒ ఈదా కోటిరెడ్డి అన్నారు. అద్దంకి బ్రాంచ్‌ను ఆయన సోమవారం సందర్శించారు. అనంతరం బ్రాంచ్ మేనేజర్ అన్నంగి శ్రీనివాసరావు అధ్యక్షతన సహకార సంఘాల సీఈఓలకు ప్యాక్స్ కంప్యూటరైజేషన్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఈఒ ఈదా కోటిరెడ్డి మాట్లాడుతూ రైతుల కు ఎప్పుడు అండగా ఉండే సహకార సంఘాల బలోపేతం కోసం పాక్స్ కంప్యూటరైజేషన్ ప్రారంభించి నట్లు తెలిపారు. దీనిలో ప్రతి సహకార సంఘం భాగస్వాములు కావాలని తెలిపారు. ఈ ప్యాక్స్ కంప్యూటరై జేషన్‌ను బ్యాంక్ అఫీషియల్ పర్సనల్ ఇన్చార్జి అయిన జాయింట్ కలెక్టర్ ప్రత్యేకంగా పరిశీలిస్తున్నారని తెలిపా రు. కంప్యూటరైజేషన్లో తలెత్తు సమస్యలను ఎప్పటికప్పుడు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్తున్నట్లు తెలిపారు. అద్దంకి బ్రాంచ్‌లోని 12 సహకార సంఘాలు త్వరితగతిన డేటా ఎంట్రీని అప్లోడ్ చేయాలని తెలిపారు. డేటా ఎంట్రీలో ఏదైనా సమస్యలు ఉంటే మేనేజర్ దృష్టికి తీసుకెళ్లాలన్నారు. రైతులకు రుణాలు ఇవ్వడంతోపాటు వాటిని ఎప్పటి కప్పుడు రికవరీ చేయవలసిన బాధ్యత సంఘ సీఈఒలపై ఉందని అన్నారు. సహకార సంఘాలు బాగుంటేనే బ్యాంక్ కూడా బాగుంటుందని అన్నారు. గత ఏడాది బ్యాంకుకు వచ్చిన లాభాల నుండి సంఘాలకు షేర్ ధనంపై 0.4 శాతం డివిడెండ్ ఇవ్వనున్నట్లు తెలిపారు. అనంతరం బ్రాంచ్ మేనేజర్ అన్నంగి శ్రీనివాసరావు బ్యాంక్ సీఈఓను సత్కరించారు. కార్యక్రమంలో బ్యాంకు సూపర్వైజర్స్ సుబ్బారావు, హరికృష్ణ, బ్యాంకు సిబ్బంది, సహకార సంఘాల సీఈలు పాల్గొన్నారు.

సీఈఒ కోటిరెడ్డిని సత్కరిస్తున్న మేనేజర్ శ్రీనివాసరావు

డీవార్మింగ్ మాత్రలు అందేలా చర్యలు

కలెక్టర్ తమీమ్ అన్సారియా

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

19 ఏళ్లలోపు పిల్లలు / కిశోర బాలలకు డీవార్మింగ్ మందులు అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఏ. తమీమ్ అన్సారియా స్పష్టం చేశారు. జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా ఈ నెల 20న అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, కళాశాలల్లో ఆల్బెండాజోల్ మాత్రలు ఉచితంగా అందజేయనున్నారు. అందులో భాగంగా సంబంధిత శాఖల అధికారులకు కలెక్టర్ పలు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఎన్‌సిడి జిల్లా నోడల్ అధికారి డాక్టర్ భగీరధి మాట్లాడుతూ జిల్లాలో మాత్రలు పొందేందుకు 5,98,048 మంది అర్హులు ఉన్నట్లు కలెక్టర్‌కు వివరించారు. 1694 మంది ఆశాలు, 894 మంది ఎఎన్ఎంల ద్వారా ఆల్బెండాజోల్ మాత్రలు అందించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇప్పటికే ఆశాలు, ఎఎన్ఎంలకు అవగాహన కల్పించామని తెలిపారు.

పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

20వ తేదీన మాత్రలు తీసుకోని పిల్లలకు 28వ తేదీన జరిగే మాప్-అప్ రోజున తప్పనిసరిగా మాత్రలు వేసేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ఆమె తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ మాత్రలు వేసుకోవడంతో కలిగే ఆరోగ్య ప్రయోజ నాలను తెలియజేయడంతో పాటు వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత ప్రాధాన్యత పైనా విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. ఎయిడ్స్ నియంత్రణ కోసం గ్రామ స్థాయిలో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే అవగాహన కార్యక్రమాలకు సంబంధించిన పోస్టర్‌ను కూడా కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డిఎం,హెచ్ఒ డాక్టర్ డి.సురేష్ కుమార్ మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యంతో రెండు నెలలపాటు అవగాహన కార్యక్రమాలు నిర్వ హిస్తామని తెలిపారు. ఆగస్టు నెల బాలకార్మిక వ్యతిరేక మాసంగా నిర్వహిస్తున్న నేపథ్యంలో కార్మిక శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 14 సంవత్సరాలలోపు బాలల చేత పనిచేయించటం చట్టరీత్యా నేరమన్నారు. 14 నుంచి 18 ఏళ్లలోపు కౌమార బాలల చేత ప్రమాద కరమైన పనులు చేయించడం కూడా చట్టరీత్యా నేరమన్నారు. ఈ అంశాలపై సమాజంలో విస్తృత అవగాహన కల్పించాలని కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ ఎ.గాయత్రీ దేవికి కలెక్టర్ దిశానిర్దేశం చేశారు.

రూతమ్మను అభినందిస్తున్న డిఎం,హెచ్ఒ సురేష్ కుమార్

ఆశా కార్యకర్త రూతమ్మను ఆదర్శంగా తీసుకోవాలి

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ఆశా కార్యకర్త రూతమ్మను ఆదర్శంగా తీసుకొని ప్రతి ఒక్కరూ విధులు నిర్వర్తించాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ డి.సురేష్ కుమార్ తెలిపారు. పీర్లమాన్యం పట్టణ ఆరోగ్య కేంద్రం , సుజాత నగర్ సచివాలయంలో పనిచేస్తున్న ఆశ వర్కర్ తళాకోళ రూతమ్మ సేవలను గుర్తించి కేంద్ర ప్రభుత్వం ఈనెల 15 న ఉత్తమ సేవ పురస్కారం అందించనుంది. ఈ నేపథ్యంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో ఆశ వర్కర్ రూతమ్మకు డిఎం,హెచ్ఒ డాక్టర్ డి.సురేష్ కుమార్ సోమవారం అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా డిఎం,హెచ్ఒ మాట్లాడుతూ ఉత్తమ సేవలకు ఎప్పుడూ గుర్తింపు ఉంటుందన్నారు. జిల్లా ఆశ వర్కర్‌కు జాతీయ ఉత్తమ సేవ పురస్కారం రావటం సంతోషంగా ఉందన్నారు. ప్రతి ఆశ కార్యకర్త రూతమ్మను ఆదర్శంగా తీసుకొని పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మాస్ మీడియా అధికారి శ్రీనివాసులు , డిపిఒ సుబ్బలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వాటర్ ఫిల్టర్ బహూకరణ

ప్రజాశక్తి - ఒంగోలు సబర్బన్

స్థానిక కర్నూలు రోడ్డులోని సరస్వతి శిశుమందిర్ స్కూల్‌కు సుహారి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మేడికొండ మోహన్ చేతులు మీదుగా వాటర్ ఫిల్టర్‌ను సోమవారం బహూ కరించారు. లక్ష్మీ శ్రీ స్పాన్సర్షిప్‌తో స్కూల్ యాజమాని రాజ్యలక్ష్మికి వాటర్ ఫిల్టర్ అందజేశారు. అనంతరం విద్యార్థులకు స్వీట్లు పంచి పెట్టారు. ఈ కార్యక్రమంలో భువనేశ్వరి, సుహరి ఫౌండేషన్ అధ్యక్షులు సాధనల సురేష్ బాబు, బండారుపల్లి రవితేజ, దాసరి శ్రీనివాస్, చిన్న, సురేష్, చైతన్య, భాను, రవితేజ, ఉష, వెంకట్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.